

అన్నవరంలో బీచ్ రిసార్ట్స్

- కన్వెన్షన్ సెంటర్ కూడా...
- ఏపీ పర్యాటక ప్రాధికార సంస్థకు 18.7 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం
- మూడేళ్లలో నిర్మాణం పూర్తిచేయాలని గడువు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భీమునిపట్నం మండలం అన్నవరం గ్రామంలో ఏపీ పర్యాటక ప్రాధికార సంస్థ (ఏపీటీఏ)కు రాష్ట్ర ప్రభుత్వం 18.7 ఎకరాలు కేటాయించింది. ఉచితంగా అందజేసిన ఈ భూమిలో ఆ సంస్థ భారీ కన్వెన్షన్ సెంటర్‌తో పాటు బీచ్ రిసార్ట్స్ నిర్మించాలని సూచించింది. ఈ నిర్మాణాలన్నీ మూడేళ్లలో పూర్తికావాలని గడువు కూడా విధించింది. బీఎస్‌ఓ నిబంధనలు దీనికి వర్తిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. అంటే ప్రభుత్వ అనుమతి లేకుండా ఈ భూమిని వేరొకరికి బదలాయించడం, లీజుకు ఇవ్వడం వంటి పనులు చేయకూడదు. కేటాయించిన భూమిలో పర్యావరణానికి సంబంధించిన నీటి వనరులు ఉంటే వాటికి విఘాతం కలగకుండా చూడాలని స్పష్టంచేసింది. ఏ అవసరాలకైతే భూమిని కేటాయించారో వాటికే ఉపయోగించాలని, వేరే అవసరాలకు వాడకూడదనే నిబంధన విధించింది. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే భూ కేటాయింపును రద్దు చేసి జిల్లా కలెక్టర్‌కు వెనక్కి తీసుకుంటారని హెచ్చరించింది. ఆ భూమిలో ఇప్పటికే ఉన్న రహదారులు, రస్తాలు కొనసాగించాలని, వాటిని మూసేయడానికి వీల్లేదని పేర్కొంది.

భూమి ఎక్కడంటే...?

అన్నవరం గ్రామంలో పాత సర్వే నంబరు 101-1లోని ఎల్‌పీఎం నంబరు 1333లో 15.405 ఎకరాలు, నంబరు 1355లో 26 సెంట్లు, నంబరు 1333 లో 3.036 సెంట్లు కలిపి మొత్తం 18.7 ఎకరాలు కేటాయించింది. బీఎస్‌ఓ నిబంధనల ప్రకారం ఈ భూమిని ఉపయోగించుకోవడానికి స్థానిక అధికార యంత్రాంగం నిరంభ్యంతర ధ్రువపత్రం ఇస్తుందని వెల్లడించింది.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా రెహమాన్

25వ జిల్లా మహాసభల్లో నూతన కార్యవర్గం ఎన్నిక

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి):



సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఎస్‌కే రెహమాన్, సహాయ కార్యదర్శులుగా కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుగా ఎం.పైడిరాజు, కె.సత్యాంజనేయ, ఆర్.శ్రీనివాసరావు, ఎం.మన్మథరావు, సీఎస్ క్షేత్రపాల్‌రెడ్డి, కె.వనజాక్షి, ఎస్.నాగభూషణం ఎన్నికైనట్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో రెండు రోజులపాటు జరిగిన జిల్లా 25వ మహాసభల్లో 33 మందితో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందన్నారు.

ఈదురుగాలులతో వర్షం

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి):

నగరంలో పలుచోట్ల సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగాయి. సాయంత్రం మేఘాలు కమ్ముకున్నాయి. ఆ తరువాత ఈదురుగాలులతో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో నగరవాసులు కాస్త సేదదీరారు. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం నుంచి రెండు రోజులపాటు వర్షాలు పెరుగుతాయని పేర్కొంది.



సమ్మర్ ట్రిప్స్ క్యాన్సిల్

యుద్ధ నేపథ్యంలో ప్రయాణాలు రద్దు



- ఊటీ, కాశీ వంటి చోట్లకు వెళ్లేందుకు కూడా వెనుకంజ
- పరిస్థితులు కుదురుకున్నాకు వెళ్లవచ్చుననే యోచనలో అత్యధికులు
- టికెట్ల క్యాన్సిలేషన్‌కు ప్రత్యేకంగా కోడ్ ఇచ్చిన ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సీజన్ కావడంతో అనేక కుటుంబాలు ముందుగానే 'సమ్మర్ ట్రిప్'నకు ప్రణాళికలు వేసుకొని విమాన, రైలు టికెట్లతో పాటు పర్యటించే ప్రాంతాల్లో హోటల్ రూమ్‌లు కూడా బుక్ చేసుకున్నాయి. అయితే పహల్గాంలో పర్యాటకులనే లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు దాడులు చేయడంతో కశ్మీర్, శ్రీనగర్, వైష్ణోదేవి ఆలయ సందర్శనకు వెళ్లాలనుకున్న వారు తమ ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. ఆ తరువాత రెండు దేశాల మధ్య యుద్ధం మొదలుకావడంతో దేశంలోని 15 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. దీంతో చాలామంది తమ టూర్లు క్యాన్సిల్ చేసుకుంటున్నారు. ఇప్పుడు కశ్మీర్ పర్యటనకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. పొరుగునే తమిళనాడు రాష్ట్రంలో ఊటీ వెళ్లడానికి టికెట్లు బుక్ చేసుకున్న వారు సైతం వాటిని రద్దు చేసుకుంటున్నారు. అక్కడ ఎటువంటి ఉద్రిక్త వాతావరణ పరిస్థితులు లేవని, సంతోషంగా వెళ్లి రావచ్చునని ట్రావెల్ ఏజెన్సీలు నచ్చజెప్పడానికి యత్నిస్తున్నా ముందుకు రావడం లేదు. బిక్కుబిక్కుమంటూ అంతంత దూరం వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోలేమని, టికెట్లు రద్దు చేయాలని ఒత్తిడి పెట్టడంతో ఏజెన్సీలు ఇక తప్పదని డబ్బులు వెనక్కి ఇస్తున్నాయి.

కాశీ వెళ్లాలన్నా ఆందోళనగా ఉంది

ఐదు కుటుంబాలు కలిసి ఈ నెల 17 నుంచి 25వ తేదీ వరకు కాశీ పర్యటన కోసం రైలు టికెట్లు, అక్కడ హోటల్ రూమ్‌లు బుక్ చేసుకున్నాము. ఎక్కువ మంది పర్యాటకులు సందర్శించే ప్రాంతాలపైనే పాకిస్థాన్ దాడులు చేసే అవకాశం ఉందని వార్తాకథనాలు వినిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాలకు కొంత కాలం వెళ్లకుండా ఉండడమే మంచిదని కూడా సూచిస్తున్నారు. దాంతో కాశీ పర్యటన రద్దు చేసుకుంటున్నాము. పరిస్థితులు కుదురుకున్నాక మరోసారి వెళదామని నిర్ణయించుకున్నాము.

- ముప్పిడి శ్రీనివాసరావు, సీతంపేట

కోడ్ ఇవ్వడంతో టిక్కెట్ల రద్దు

- కె.విజయమోహన్, అధ్యక్షులు, ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్.

దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంతో 15 ... మిగతా 6వ పేజీలో

పర్యాటకులకు హోమ్ స్టే

రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని పర్యాటక శాఖ పిలుపు

- కనీసం ఒక గది నుంచి ఆరు గదుల వరకూ అన్ని వసతులతో పర్యాటకులకు అందించగలిగేవారు పేర్లు నమోదు చేయించుకోవచ్చు
- ఆసక్తి కలిగిన వారికి త్వరలో అవగాహన కార్యక్రమం

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం వచ్చే పర్యాటకులకు 'ఇంటిలో అతిథ్యం' ఇవ్వాలనుకునేవారు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని పర్యాటక శాఖ అధికారులు పిలుపునిచ్చారు. ఎవరికైనా సొంత ఇల్లు/విల్లా/అపార్టుమెంట్ ఫ్లాట్ ఉండి, వాటిని పర్యాటకులకు రోజువారీ పద్ధతిలో అద్దెకు ఇవ్వడానికి ఆసక్తి ఉంటే పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా పర్యాటక శాఖాధికారిణి జె.మాధవి సూచించారు.

హోమ్ స్టే అంటే...

పర్యాటకులకు అన్ని ప్రాంతాల్లోను హోటళ్లలో గదులు లభించవు. అలాగే తినడానికి ఆహారం కూడా దొరకదు. చాలామంది పర్యాటకులు స్థానికంగా లభించే ఆహార పదార్థాలను రుచి చూడాలనుకుంటారు. అక్కడి మనుషులతో మాట్లాడి, సంస్కృతీ సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, దుస్తులు, స్థానిక కళల గురించి తెలుసుకోవాలనుకుంటారు. ఇవన్నీ సాధారణ హోటళ్లలో లభించవు. అటువంటి అభిరుచి కలిగిన వారికి స్థానిక విధానంలో 'వసతి సౌకర్యాలు' కల్పించడాన్ని 'హోమ్ స్టే'గా వ్యవహరిస్తున్నారు. కశ్మీర్, పంజాబ్ వంటి రాష్ట్రాలతో పాటు మలేషియా వంటి దేశాల్లో, గిరిజన ప్రాంతాల్లో ఈ హోమ్ స్టే బాగా ఆదరణ పొందింది. దీనివల్ల స్థానికులకు కూడా ఉపాధి లభిస్తోంది. వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రచారం పెరుగుతోంది. ప్రభుత్వాలపై ఒత్తిడి తగ్గుతోంది. రాష్ట్రాలకు వచ్చే పర్యాటకులకు అవసమైనన్ని గదులు పర్యాటక, ప్రైవేటు సంస్థలు సమకూర్చలేకపోతున్నాయి.



ఈ హోమ్ స్టే వల్ల పర్యాటకంగా డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో స్థానికులే వారి గృహాలను అందంగా అలంకరించి, వాణిజ్య ధరల కంటే తక్కువకే వసతి కల్పించడం, ఇంట్లో వండిన ఆహార పదార్థాలను ఆప్యాయంగా వడ్డించడం వల్ల పర్యాటకుల సంతృప్తి శాతం పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం దీనిని నూతన పర్యాటక పాలసీలో చేర్చింది. కనీసం ఒక గది నుంచి ఆరు గదుల వరకు అన్ని వసతులతో పర్యాటకులకు అందించగలిగేవారు పేర్లు నమోదు చేయించుకోవాలని పిలుపునిచ్చింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార ... మిగతా 6వ పేజీలో

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల వెల్లువ

- ఎస్సీ నిరుద్యోగ యువత కోసం జిల్లాకు 406 యూనిట్లు, రూ.16.88 కోట్లు మంజూరు
- కనిష్ఠంగా రూ.లక్ష నుంచి గరిష్ఠంగా రూ.4 లక్షల వరకూ
- ఇప్పటికే 8,945 దరఖాస్తులు రాక
- జాబితాలో 32 కేటగిరీలకు చెందిన వ్యాపారాలు



విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి):

కూటమి ప్రభుత్వం సంక్షేమ శాఖలకు భారీగా నిధులు మంజూరుచేస్తోంది. సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలను అందించి, నిరుద్యోగ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికలను అమలు చేస్తోంది. ఇప్పటికే బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వందలాది మందికి సబ్సిడీతో కూడిన రుణాలు ప్రభుత్వం మంజూరుచేసింది. ఈ క్రమంలోనే ఎస్సీ నిరుద్యోగ యువతకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించేందుకు దరఖాస్తులను స్వీకరించింది.

జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను ఎస్సీ నిరుద్యోగ యువతకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించేందుకు 406 యూనిట్లు మంజూరుచేసింది. ఇందుకు రూ.16.88 కోట్ల వ్యయం అవు తుందని అంచనా వేసింది. ఈ మొత్తంలో రూ.6.68 కోట్లు సబ్సిడీ కాగా, రూ.9.35 కోట్లు బ్యాంకుల ద్వారా రుణంగా అందించనున్నారు. లబ్ధిదారుల వాటా రూ.0.84 కోట్లుగా నిర్ణయించారు. కనిష్ఠంగా లక్ష రూపాయల నుంచి గరిష్ఠంగా నాలుగు లక్షల వరకూ రుణాలను పొందేందుకు అవకాశం ఉంది.

406 యూనిట్లు, 8,945 దరఖాస్తులు..

జిల్లాకు 406 యూనిట్లను మంజూరుచేయగా 8,945 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఒక్కో యూనిట్‌కు 22 మంది పోటీపడుతున్నారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ ... మిగతా 6వ పేజీలో

బియ్యం కార్డుల్లో

మార్పులు, చేర్పులకు భారీగా దరఖాస్తులు

- ఇప్పటివరకూ 2,147 రాక

విశాఖపట్నం, మే 12(ఆంధ్రజ్యోతి):

కొత్త బియ్యం కార్డులు, ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం జిల్లాలో సోమవారం నాటికి 2,147 దరఖాస్తులు వచ్చాయి. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న బియ్యం కార్డుల్లో కొత్తగా సభ్యుల పేర్లు నమోదు చేయాల్సి ఉందని 1,457 మంది దరఖాస్తు చేసుకు న్నారు. అలాగే కొత్తగా కార్డుల కోసం 262, కార్డుల విభజనకు 168, కార్డు నుంచి పేర్ల తొలగింపునకు సంబంధించి 123 దరఖాస్తులు వచ్చాయి. బియ్యంకార్డుతో ఆధార్ కార్డు అనుసంధానంలో తప్పుల సవరణ కోసం 112, రేషన్ దుకాణాల రెన్యువల్‌కు 13, బియ్యం కార్డులో చిరునామా మార్పునకు 10 దరఖాస్తులు రాగా ఇద్దరు బియ్యం కార్డును ప్రభుత్వానికి సరండర్ చేశారు. కొత్త కార్డులకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు మరోసారి చేయనవసరం లేదని అధికారులు పేర్కొన్నారు.



వేసవి క్రీడా శిబిరాలపై సందిగ్ధం

రూ.1.3 కోట్లతో ప్రతిపాదనలు

- సిద్ధం చేసిన జీవీఎంసీ అధికారులు
- నెల క్రితమే ఇన్‌చార్జి కమిషనర్ గ్రీన్‌సిగ్నల్
- ఇంతవరకూ కౌన్సిల్ ఆమోదం పొందని వైనం



విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ వేసవి క్రీడా శిబిరాల నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. క్రీడల పట్ల చిన్నారుల్లో ఆసక్తి పెంపొందించేందుకు, ఇప్పటికే అవగాహన ఉన్నవారికి మెళకువలు నేర్పేందుకు జీవీఎంసీ ఏటా వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటుచేస్తుంది. మే నెలలో 15 నుంచి 20 రోజులుపాటు ఈ శిబిరాలను నిర్వహిస్తుంది. ఈ ఏడాది కూడా ప్రతి వార్డులో శిబిరాలు ఏర్పాటుచేయాలని అధికారులు ప్రతిపాదనలు తయారుచేశారు. శిబిరాలకు వచ్చే పిల్లలకు టీషర్టులు, బిస్కెట్‌ప్యాకెట్, పాలు, శిక్షణ ఇచ్చే కోచ్‌లకు గౌరవ వేతనం చెల్లింపు, క్రీడా పరికరాలు కొనుగోలు వంటివాటికి రూ.1.3 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇందుకు ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అనుమతి తీసుకున్నారు. ప్రతిపాదనకు కౌన్సిల్ ఆమోదం తెలిపిన తర్వాత టెండర్లు పిలిచి క్రీడా శిబిరాలను ప్రారంభించాల్సి ఉంది. అయితే జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపి దాదాపు నెల రోజులు గడుస్తున్నా సరే కౌన్సిల్ ఆమోదం లభించకపోవడంతో క్రీడా శిబిరాల నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 20న కౌన్సిల్ సమావేశం నిర్వహించే అవకాశం ఉందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. ఒకవేళ...అప్పుడు వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణ ప్రతిపాదనకు ఆమోదం తెలిపినా...క్రీడా పరికరాల సరఫరాకు ... మిగతా 6వ పేజీలో

19న డిప్యూటీ మేయర్ ఎన్నిక

- జాయింట్ కలెక్టర్‌కు నిర్వహణ బాధ్యతలు

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నిక ఈ నెల 19న నిర్వహించాలని ఆదేశిస్తూ రాష్ట్ర మునిసిపల్ శాఖ డైరెక్టర్, కమిషనర్ పి.సంపత్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కొత్త డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకునేందుకు వీలుగా జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను ఎన్నికల అధికారిగా నియమిస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 19న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి, డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించాలని, ఈ మేరకు కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డిప్యూటీ మేయర్‌గా ఉన్న జియ్యాని శ్రీధర్‌పై కూటమి కార్పొరేటర్లు గత నెల 26న జరిగిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిన విషయం తెలిసిందే.

ఉపాధ్యాయ బదిలీలకు రంగం సిద్ధం

- కొత్త మార్గదర్శకాల ప్రకారం పోస్టులు కేటాయింపు
- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సుమారు 250 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మిగులు
- మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు నియమించాలని ప్రభుత్వ ఆదేశం
- స్కూలు అసిస్టెంట్ పదోన్నతులపై నీలినీడలు

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి):

ఉపాధ్యాయుల బదిలీలకు పాఠశాల విద్యా శాఖ సిద్ధమైంది. జీవో 117 రద్దు నేపథ్యంలో కొత్తగా రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం త్వరలో బదిలీలు చేపట్టనున్నది. ఒకటి, రెండు రోజుల్లో బదిలీల షెడ్యూల్ విడుదల కానున్నది. షెడ్యూల్ వచ్చే నాటికి బదిలీల ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలు అమలుకు విద్యా శాఖ సన్నద్ధమవుతుంది. తాజాగా విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తికి అనుగుణంగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రస్తుతం ఎన్ని పోస్టులు ఉన్నాయి?, ఎంతమంది పనిచేస్తున్నారు?, ఖాళీలు ఎన్ని?, విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా టీచర్లను సర్దుబాటు చేయగా ఎన్ని పోస్టులు మిగులుతాయి?...అనేదానిపై జిల్లా విద్యాశాఖ కసరత్తు పూర్తిచేసింది. బదిలీల జీవో వెలువడిన తరువాత దానిలో పేర్కొన్న విధంగా బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానం, అభ్యంతరాలు స్వీకరణ చేపట్టి తుదిగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నది.



పునర్వ్యవస్థీకరణ అనంతరం ఉమ్మడి విశాఖ జిల్లాలో అందుబాటులోకి రానున్న ఏడు రకాల పాఠశాలల్లో టీచర్లను నియమించనున్నారు. ప్రస్తుతం ఉన్న పోస్టులకు ... మిగతా 6వ పేజీలో

కొత్తవలస మాస్టర్ ప్లాన్ రహదారికి లైన్ క్లియర్

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి):

భీమునిపట్నం మండలంలోని కొత్తవలస మాస్టర్ ప్లాన్ రహదారిని 24 మీటర్ల వెడల్పున విస్తరించడానికి సోమవారం ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కొత్తవలసలో గతంలో శారదా పీఠానికి వైసీపీ ప్రభుత్వం 15 ఎకరాలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఆ భూ కేటాయింపును ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. అతి కీలకమైన ఆ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడానికి వీఎంఆర్‌డీఏ ముందుకువచ్చింది. మాస్టర్ ప్లాన్‌లో ఉన్న రహదారి నిర్మించడానికి ప్రతిపాదనలు రూపొందించింది. ఆ రహదారి ఏయే సర్వే నంబర్ల గుండా వెళుతుందో వివరిస్తూ రెండు నెలల క్రితమే ప్రకటనలు ఇచ్చింది. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరింది. ఎవరి నుంచి ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో ప్రభుత్వానికి అదే విషయం నివేదించడంతో మాస్టర్ ప్లాన్ నిర్మాణం విషయంలో ముందుకు వెళ్లాలని సూచిస్తూ ఆదేశాలు ఇచ్చింది.

ఆంగ్ల భాషపై శిక్షణ

భీమునిపట్నం (రూరల్), మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలకుద్దు గ్రామంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సోమవారం నుంచి ఆంగ్ల భాషపై ఉచిత శిక్షణ ప్రారంభించారు. జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఇంగ్లీషు ఉపాధ్యాయుడు గంటాన మోహనరావు ఆధ్వర్యంలో ఈ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు విద్యార్థులకు ఆంగ్లంలో రాయడం, మాట్లాడడం, తప్పులను సరిచేయడం, ప్రశ్నలను సరైన ఉచ్ఛారణలో పలికించడం, ధస్తూరి, తదితర వాటిపై శిక్షణ ఇస్తామని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొమ్మాది, మే 12 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పీఎంపాలెం యూపీహెచ్‌సీ పరిసరాల్లో డాక్టర్ సృజన ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది షేక్ సుభాని, ఉమా శంకర వర్మ, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

కొమ్మాది, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఆక్రమణలో ఉన్న రహదారి స్థలాన్ని స్వాధీనం చేసుకుని సగంలో ఆగిపోయిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి. అప్పలరాజు కోరారు. సోమవారం ఆయన జోన్-2 కార్యాలయంలో కమిషనర్ కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో జీవీఎంసీ కమిషనర్లగా పనిచేసిన రాజబాబు, సంపత్‌కుమార్ స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలు తొలగించి, రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.



పెండాల్స్ నీడన అమ్మకాలు సాగిస్తున్న వ్యాపారులు



కూరగాయల మార్కెట్‌లో నిర్మాణంలో ఉన్న షెడ్లు

మార్కెట్ షెడ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం

- ఎండలో అమ్మకాలు చేయలేక వ్యాపారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

భీమునిపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మునిసిపల్ లాల్ బహదూర్‌శాస్త్రి మార్కెట్ ఆవరణలో కూరగాయలు, చేపల మార్కెట్ షెడ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో వ్యాపారులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. మార్కెట్‌లో షెడ్లు శిథిలమయ్యాయని, ఏడాది క్రితం గంట స్తంభం వద్ద పెండాల్స్, పగోడాలు ఏర్పాటు చేసి అక్కడకు వ్యాపారులను తరలించారు. అనంతరం శిథిలమైన షెడ్లను తొలగించి నూతన దుకాణాల నిర్మాణం చేపట్టారు. ఒకవైపు 14 చొప్పున రెండు వైపులా 28 దుకాణాలు నిర్మిస్తున్నారు. అయితే నిర్మాణంలో జరుగుతున్న జాప్యం వల్ల వ్యాపారులు పగోడాలు, పెండాల్స్ కింద వ్యాపారాలు సాగించలేక అష్టకష్టాలు పడుతున్నారు. పది రోజుల క్రితం కురిసిన ఈదురుగాలులు, వర్షంతో పెండాల్స్ వేసిన ఐరన్ పోల్స్ విరిగి పడ్డాయని, పెండాల్స్ కూడా పాడయ్యాయని వ్యాపారులు చెబుతున్నారు. ఎండల తీవ్రతకు పెండాల్స్ కిందన వేడి తట్టుకోలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. పైగా వీధి లైట్ల సదుపాయం అరకొరగా ఉండడంతో సాయంత్రం వేళ ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు లేకపోవడంతో మందుబాబులకు షెడ్లు అడ్డాగా మారాయి. అధికారులు స్పందించి షెడ్ల నిర్మాణం త్వరతగతిన చేపట్టాలని పలువురు కోరుతున్నారు. కాగా ఈ విషయమై జీవీఎంసీ భీమిలి జోనల్ కార్యాలయం ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడగా నూతన షెడ్లకు రంగులు వేస్తున్నామని, విద్యుత్ సదుపాయం కల్పించి, వ్యాపారులు అందిస్తామని చెప్పారు.

ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు : సీఐ

పద్మనాభం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపల్లి, పాండ్రంగి గ్రామాల్లో జరుగుతున్న గ్రామ దేవతల పండగల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సీఐ సీహెచ్ శ్రీధర్ ఆదేశించారు. సోమవారం ఆయన పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంగళవారం రెడ్డిపల్లిలో జరిగే బంగారమ్మ పండగ, పాండ్రంగిలో నిర్వహించే జట్లమ్మ సిరిమానోత్సవం సందర్భంగా శాంత్రిభద్రతల పరిరక్షణలో, ట్రాఫిక్ నియంత్రణలో సమర్థంగా విధులు నిర్వహించాలన్నారు. మధురవాడ ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో రెడ్డిపల్లి పండగకు 46 మంది, పాండ్రంగి పండగకు 84 మందిని బందోబస్తుకు కేటాయిస్తున్నామని తెలిపారు. రెడ్డిపల్లి పండగ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 5 నుంచి రాత్రి 8 వరకూ ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామన్నారు. సమావేశంలో సీఐ సాయి, ఎస్సై సురేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీధర్



పాండ్రంగిలో జట్లమ్మ పండగ సందర్భంగా ఉయ్యాల కంబాల ఉత్సవం

ఘనంగా జట్లమ్మ అమ్మవారి తొలేళ్లు

పద్మనాభం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాండ్రంగి గ్రామంలో జట్లమ్మ అమ్మవారి సిరిమాను పండగ మహోత్సవం సందర్భంగా సోమవారం తొలేళ్ల సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఘటాలను ఊరేగించారు. అనంతరం రాజవీధిలో తాటి చెక్కలతో ఊయలు ఏర్పాటు చేసి ఉయ్యాల -కంబాల ఉత్సవం నిర్వహించారు. గ్రామంలోని అమ్మవారి మందిరం నుంచి అమ్మవారిని ఘటాలతో పాటు ఊరగించారు. అనంతరం సతకం పట్టు వద్ద నిలిపి పూజలు చేశారు. తొలేళ్ల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రామరాజు, కుర్రపల్లి బాబు, వజ్రకుమార్‌రాజు, రవిబాబు, అముజూరు అప్పారావు, మహేశ్, కొసర అప్పలనాయుడు, బోజరాజు అప్పలనాయుడు, బీఎస్ఎస్ శ్రీనివాసరావు, పతివాడ నాయుడు, కె. కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో బంగారమ్మ పండగ

రెడ్డిపల్లి గ్రామంలో బంగారమ్మ పండగ సందర్భంగా సోమవారం తొలేళ్ల ప్రారంభయ్యాయి. ఉత్సవంలో భాగంగా గ్రామంలోని అమ్మవారి మందిరం నుంచి కోలాటంతో ఘటాలను వీధుల్లో ఊరేగించారు.రామాలయం వద్ద ఉన్న సతకం పట్టు దగ్గర ఘటాలను నిలిపి అమ్మవారికి పూజలు చేశారు. కాగా అత్యంత వైభవంగా నిర్వహించే ఈపండగ సందర్భంగా ఇప్పటికే ఆలయానికి రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయం నుంచి గ్రామం ప్రధాన రోడ్డు సుమారు కిలోమీటరు మేర వేసిన విద్యుద్దీపాలంకరణతో గ్రామమంతా దేదీప్యమానంగా వెలుగొందుతుంది. మంగళవారం అనుపోత్సవం సందర్భంగా భారీ ఊరేగింపు, సంబరాలతో అమ్మవారిని ఊరిపొలిమేరలో ఉన్న ఆలయానికి తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు.



రెడ్డిపల్లిలో బంగారమ్మ తల్లి ఘటాల ఊరేగింపు

సంప్రదాయేతర ఇంధనం వాడకంపై అవగాహన

సాగర్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయేతర ఇంధన వనరులైన సౌర, పవన విద్యుత్‌ను కృత్రిమ మేధ సహకారంతో ఎలక్ట్రికల్ వాహనాలకు అనుసంధానం చేయడంపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం (ఎఫ్‌డీపీ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐటీ జోధ్‌పూర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిశాంత్ కుమార్, ఐఐటీ భువనేశ్వర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్‌కే స్వామినాయుడు మాట్లాడుతూ సౌర, పవన విద్యుత్ ద్వారా ఎలక్ట్రికల్ వాహనాలకు ఏవిధంగా చార్జ్ చేయవచ్చో వివరించారు.

తొమ్మిదో వార్డులో జోన్ -2 జడ్సీ పర్యటన



జోడుగుల్లపాలెంలో స్థానికులతో మాట్లాడుతున్న జడ్సీ కనక మహాలక్ష్మి

విశాలాక్షినగర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని జోడుగుళ్ళపాలెంలో జోన్-2 కమిషనర్ కనక మహాలక్ష్మి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీలు, వీధి లైట్లు, తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పారిశుధ్యం నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కి జడ్సీ సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విభాగం అసిస్టెంట్ ఆఫీసర్ కిశోర్, బీజేపీ విశాఖ పార్లమెంట్ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు రెండు వినతులు



జోన్ -1 జడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం ఇస్తున్న అర్జీదారులు

భీమునిపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు రెండు అర్జీలు అందాయి. జడ్సీ అయ్యప్పనాయుడు వినతులు స్వీకరించారు. పరిపాలనా విభాగానికి, రెవెన్యూ విభాగానికి సంబంధించిన అర్జీలు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

వైభవంగా వెంకన్న తిరు కల్యాణం



స్వామివారి తులాభారం

భీమునిపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి తిరు కల్యాణం నిర్వహించారు. తొలుత ఆలయ ప్రధానార్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో యాగశాల్వానలు, విశేష హోమాలు జరిపారు. అనంతరం శ్రీవారి ఉత్సవమూర్తులకు అలంకార తిరుమంజనసేవ, పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెను చేయడం వంటి కార్యక్రమాలను వేదోక్తముగా నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం, సరిగమ అకాడమీ ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనలు జరిగాయి.

రుషికొండ ఐటీ రోడ్డులో కారు బోల్తా

ఎండాడ, మే 12 (ఆంధ్రజ్యోతి) : మితిమీరిన వేగం వల్ల ఓ కారు బోల్తా పడింది.ఎండాడ లా కళాశాల నుంచి రుషికొండ ఐటీ రోడ్డులో అతి వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పడంతో డివైడర్ మధ్యలో ఉన్న ఐరెన్ గ్రిల్స్‌ను ధ్వంసం చేసి బోల్తా కొట్టింది. ప్రమాదం జరిగినప్పుడు కారులో ముగ్గురు ఉన్నట్టు తెలిసింది, ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పీఎంపాలెం ట్రాఫిక్ సీఐ సాయి సంఘటన స్థలాన్ని పరిశీలించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే గంటాకు త్రిశక్తి దేవాలయం కమిటీ వినతి

కొమ్మాది, మే 12 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది జంక్షన్‌లోని మూడుగుళ్ల (త్రిశక్తి దేవాలయం)కు చెందిన భూమిని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సోమవారం వారు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చినగదిలి తహసీల్దార్ పాల్ కిరణ్‌ను కలిసి వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ త్రిశక్తి దేవాలయం వెనుక ఉన్న స్థలం కొన్నేళ్లుగా ఆలయ ఆధీనంలో ఉందని, ఆ స్థలంలో అమ్మవారికి సంబంధించిన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో కూడా కొందరు స్థల ఆక్రమణకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు దగ్గరుండి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. గతంలో ప్రభుత్వ భూమిగా పేర్కొన్న స్థలం ఇప్పుడు ప్రైవేటు భూమిగా ఎలా మారిపోతుందని ప్రశ్నించారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, కుడితి రామారావు, వాండ్రాసి అప్పలరాజు, పిళ్లా సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఘనంగా నర్సుల దినోత్సవం

ఎండాడ, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ - రుషికొండ డబుల్ రోడ్డులో ఉన్న సెయింట్ లూక్స్ నర్సింగ్ కళాశాలలో ఫోరెన్స్ నైటింగేల్ జయంతి పురస్కరించుకుని అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయాలూక్ ఆఫ్ నర్సింగ్, సెయింట్ లూక్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్ డాక్టర్ మమతా ప్రసాద్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థినులు ర్యాలీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ నైటింగేల్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత ప్రీతమ్ లూక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగవల్లి, ప్రో ఓషిన్ డాక్టర్ సుహాసినీ, అశ్వనీకుమారి పాల్గొన్నారు. అలాగే గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలోనూ నైటింగేల్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో జిమ్సర్ ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, ఈస్ట్రన్ నేవల్ కమాండ్ వైద్య విభాగం ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రి డిప్యూటీ ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ కల్నల్ జెస్సీ ఐజాక్, జిమ్సర్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎస్వీరావు మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిలో అంకితభావంతో సేవలందించాలని, వృత్తి నైపుణ్యాలతో పాటు విలువలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేషన్ బాలు, నిర్వాహక కార్యదర్శులు డాక్టర్ సీహెచ్ లావణ్య, ఎస్వీఎల్ పద్మకుమారి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. అంతకముందు పలువురు నైటింగేల్ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.



విజేతకు బహుమతి అందిస్తున్న ప్రో వీసీ గీతాంజలి

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తులు ఆహ్వానం

భీమునిపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పారాలీగల్ వలంటీర్లు (న్యాయ సహాయకులు)గా పనిచేయడానికి ఆసక్తి గల యువత దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంఘం అధ్యక్షురాలు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ డి. సౌజన్య తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. న్యాయ సలహాలతో పాటు న్యాయ సహాయం చేయాలన్న ఆలోచన వున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, వివిధ సేవా సంస్థల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తులను భీమిలి కోర్టు ఆవరణలో వున్న మండల న్యాయ సేవాధికార సంఘం కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. శిక్షణ అనంతరం 25 నుంచి 50 మంది పారా లీగల్ వలంటీర్లగా ఏడాది కాలానికి ఎంపిక చేసి నియమిస్తామన్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు

సింహాచలం, మే 12(ఆంధ్రజ్యోతి) : వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని సింహగిరిపై రాజగోపురానికి చేరువలోని కళావేదికపై విశాఖకు చెందిన అన్నమయ్య జానపద కళా క్షేత్రానికి చెందిన కళాకారులు సోమవారం ఉదయం నుంచి పలు సంకీర్తనలు ఆలపించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆలపించిన అన్నమయ్య కీర్తనలు భక్తులను ఆద్యంతం అలరించాయి. అనంతరం కళాకారులకు ఆలయ సిబ్బంది స్వామివారి దర్శనం కలిపి అన్నప్రసాదాన్ని అందజేశారు.

అగ్నివీర్ మురళీనాయక్‌కు నివాళి



మురళీ నాయక్ మృతి పట్ల నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

పద్మనాభం, మే 12 (ఆంధ్రజ్యోతి) : పాకిస్థాన్ జరిపిన దాడుల్లో మృతి చెందిన అగ్నివీర్ మురళీ నాయక్ సంస్మరణ సభను బీజేపీ నాయకులు పద్మనాభంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ అగ్నివీర్ మురళీ నాయక్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌ఛార్జి రూపాకుల రవికుమార్, మండల అధ్యక్షురాలు టి. నాగమణి, నాయకులు శ్రీనివాసరావు, కృష్ణారావు, వెంకటరావు, పేర్రాజు, గౌరి రెడ్డి పాల్గొన్నారు.

భీమిలిలో ఈదురుగాలులు



పట్టణంలో కమ్ముకున్న కారు మబ్బులు

భీమునిపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలు లతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం ఆరు గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి అర్ధగంట పాటు ఈదురుగాలులతో వర్షం పడింది. వర్షంతో పట్టణవాసులు సేదతీరారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల వెల్లువ

(5వ పేజీ తరువాయి)

14 నుంచి మే పదో తేదీ వరకు దరఖాస్తులను స్వీక రించాలి. అయితే, కొన్ని కారణాల వల్ల ఏడో తేదీ నుంచి ఆన్‌లైన్ వెబ్‌సైట్ నిలిచిపోయింది. మరో రెండు, మూడు రోజుల్లో మళ్లీ వెబ్‌సైట్ ఓపెన్ అవుతుందని అధికారులు చెబుతున్నారు. అలాగే, ప్రస్తుతం 32 కేటగిరీలకు సంబంధించి వస్తు తయారీ, సేవల యూనిట్లకు రుణాలను అందిస్తున్నారు. ఈ సంఖ్యను మరింత పెంచే అవకాశం ఉందంటున్నారు. ఇందులో టెంట్ హౌస్, చిరు దుకాణాలు ఏర్పాటు వంటివి చేర్చనున్నట్టు అధికారులు వెల్ల డించారు. దీంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ఈ యూనిట్లకు రుణాలు..

ఇప్పటివరకూ ఫ్లవర్ బొకే మేకింగ్ అండ్ డెకరేషన్, వర్మీ కంపోస్ట్ అండ్ ఆర్గానిక్ మాన్యుర్, వైబ్‌సైట్ డెవలప్‌మెంట్ అండ్ ఐటీ సర్వీసెస్, ఎల్ఈడీ బల్బులు అండ్ ఎనర్జీ సేవింగ్ డివైజ్ అసెంబ్లింగ్, ప్లంబింగ్ అండ్ ఎలక్ట్రీషియన్ సర్వీసెస్, వాటర్ బాటిల్ రీఫిల్ అండ్ ప్యూరిఫికేషన్ కియోస్క్, వాటర్ రీసైక్లింగ్ అండ్ అప్ సైక్లింగ్ బిజినెస్, మొబైల్ రిపేరింగ్ అండ్ ఎలక్ట్రానిక్ సర్వీసెస్, సోప్, డిటర్జెంట్ అండ్ మేకింగ్స్, ఫిష్ ఫార్మింగ్ (అగ్రికల్చర్), అడ్వంచర్ టూరిజం (ట్రెక్కింగ్ అండ్ క్యాంపింగ్), మొబైల్ కార్ వాష్ అండ్ సర్వీస్, బేకరీ అండ్ కన్ఫెక్షనరీ యూనిట్, ఫ్లైయాష్ బ్రిక్ ప్రొడక్షన్, స్కిల్ ప్రొడక్షన్, వాటర్ ప్యూరిఫికేషన్, వెల్డింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ యూనిట్, జూట్ బ్యాగ్ అండ్ ఈకో ఫ్రెండ్లీ ప్రొడక్ట్ మేకింగ్, సోలార్ ఎనర్జీ ప్రొడక్టు సేల్స్ అండ్ ఇన్‌స్టాలేషన్, సోలార్ ప్యానల్ అసెంబ్లింగ్ అండ్ ఇన్‌స్టాలేషన్, కాయిర్ ప్రొడక్ట్ మానుఫ్యాక్చరింగ్, ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ, ఆయుర్వేదిక్ క్లినిక్, జనరిక్ మెడికల్ షాప్, బ్యూటీ పార్లర్, మెడికల్ ల్యాబ్, ఈవీ బ్యాటరీ చార్జింగ్ యూనిట్, పాసింజర్ ఆటో (3 వీలర్-ఈ ఆటో), పాసింజర్ ఆటో (4 వీలర్), పాసింజర్ కార్స్ (4 వీలర్), గూడ్స్ ట్రక్, డ్రోన్స్ ఫర్ అగ్రికల్చర్ (గ్రూప్ ఆక్టివిటీ) వంటివి ఉన్నాయి. వీటికి మరిన్ని సెక్టార్లను జోడించనున్నట్టు చెబుతున్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు రంగం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

అదనంగా మరిన్ని అవసరమా?, లేక తగ్గించాలా?...అనే అంశంపై ఇప్పటికే అధికారులు ఒక అవగాహనకు వచ్చారు. దీని ప్రకారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 250 వరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మిగులుతున్నట్టు గుర్తించారు. కొత్తగా రానున్న 237 మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా స్కూలు అసిస్టెంట్లను నియమించాలని ప్రభుత్వం ఆదేశించినందున రమారమి 15 నుంచి 20 పోస్టులే మిగిలే అవకాశం ఉంది. ఒక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్నపక్షంలో...అక్కడ ఖాళీగా ఉన్న పోస్టును తొలుత మిగులుగా గుర్తిస్తారు. అనంతరం ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తయిన టీచర్ పోస్టులను పరిగణనలోకి తీసుకుంటారు. ఇలా లెక్కలు కట్టగా ఉమ్మడి జిల్లాలో తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులలో 250 స్కూల్ అసిస్టెంట్లు మిగులు ఉన్నట్టు గుర్తించారు. అయితే వారిని కొత్తగా రానున్న మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వారిలో ఎక్కువమంది సర్దుబాటుకు అవకాశం ఏర్పడింది. దీంతో వచ్చే వారంలో చేపట్టనున్న స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులపై నీలినీడలు కమ్ముకున్నాయి. స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు లేకపోవడంతో పదోన్నతులు ఎలా ఇస్తారని పలువురు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వచ్చే రెండు నెలల్లో ఎక్కువ మంది టీచర్లు పదవీ విరమణ చేయనున్నందున...అప్పుడు ఏర్పడే ఖాళీలను పరిగణనలోకి తీసుకుని స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు కల్పించే అవకాశం ఉందని మరికొందరు భావిస్తున్నారు.

వేసవి క్రీడా శిబిరాలపై సందిగ్ధం

(5వ పేజీ తరువాయి)

టెండర్ పిలవాల్సి ఉంటుంది. దీనికోసం కనీసం వారం, పది రోజులు గడువు ఇవ్వాలి. ఈ లెక్కన మే నెలాఖరు నాటికిగానీ టెండర్ ప్రక్రియ పూర్తికాదని అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత టెండర్లు ఖరారై క్రీడా పరికరాలను సరఫరా చేసినాసరే...జూన్ 12 నుంచి పాఠశాలల పునఃప్రారంభం ఉంటుంది కాబట్టి శిబిరాలను నిర్వహించడానికి అవకాశం ఉండదు. ఏటా మే నెలలో జరిగే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను జూన్ నెలలో నిర్వహిస్తే తీవ్రస్థాయిలో విమర్శలు వస్తాయని జీవీఎంసీ పాలకవర్గం పెద్దలు భావిస్తున్నారు. అందుకే వీలైతే షార్ట్‌టెండర్ ద్వారా క్రీడా పరికరాల సరఫరాకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని జీవీఎంసీ అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో శిబిరాల నిర్వహణపై సందిగ్ధం నెలకొందనే చెప్పుకోవాలి.

పర్యాటకులకు హోమ్ స్టే

(5వ పేజీ తరువాయి)

సంస్థ (ఏపీటీఏ) వెబ్‌సైట్‌లో ఎవరికి వారే వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 0891-2754716 నంబరులో సంప్రతించాలని జె.మాధవి సూచించారు. కొద్దిరోజులు గడిచాక ఆసక్తి కలిగిన వారిని పిలిచి అవగాహన సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. విధి విధానాలు తెలియజేస్తామని, పర్యాటకులే నేరుగా ఎవరికి ఎక్కడ నచ్చితే అక్కడి హోమ్ స్టేను ఎంపిక చేసుకుంటారని వివరించారు.

సమ్మర్ ట్రిప్స్ క్యాన్సిల్

(5వ పేజీ తరువాయి)

విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. దీనివల్ల ప్రయాణికులు ఇబ్బంది పడకూడదని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా టికెట్లు బుక్ చేసుకున్నవారికి ప్రత్యేకంగా 'కోడ్' ఇచ్చింది. దానిని ఉపయోగించుకొని టికెట్లు రద్దు చేసుకుంటే డబ్బులు వాపస్ ఇస్తామని వెల్లడించింది. దాంతో గత మూడు రోజుల్లో మా సంస్థలోనే 300 మంది టికెట్లు రద్దు చేసు కున్నారు. దేశీయ పర్యాటక రంగంపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోంది.

ఘనంగా నర్సుల దినోత్సవం

అగనంపూడి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఏరియా ఆస్పత్రిలో ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ ఉష, వైద్యులు కేక్ కట్ చేసి నర్సింగ్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. రోగులకు వైద్య సేవలతో పాటు అన్ని విధాల సపర్యలు చేసి త్వరగా కొలుకునేలా నర్సింగ్ సిబ్బంది చేస్తున్న కృషిని వారు కొనియాడారు. అనంతరం నర్సింగ్ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పెదగంట్యాడ: నర్సు కన్నతల్లితో సమానమని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా పెదగంట్యాడ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై స్టాఫ్ నర్సును సత్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రమేశ్‌బాబు, బీజేపీ నాయకులు కె.ముసలయ్య,జి.శంకరరావు, నాగేశ్వరరావు, రామస్వామి, రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థంతో ఇద్దరి అరెస్టు

గాజువాక, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎండీఎంఏ మత్తు పదార్థం కలిగివున్న ఇద్దరు వ్యక్తులను గాజువాక పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోనగర్ ప్రాంతానికి చెందిన చింతలపూడి సత్యకుమార్, కొండపల్లి తరుణ్‌లు ఇటీవల బెంగళూరు వెళ్లి అక్కడ నుంచి ఎండీఎంఏ అనే 2.4 గ్రాముల మత్తుపదార్థాన్ని ఇక్కడకు తెచ్చారు. దీనిపై సమాచారం అందుకున్న నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆటోనగర్ వద్ద వీరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా మత్తు పదార్థం లభ్యమైంది. దీంతో వారిని గాజువాక పోలీసులకు అప్పగించగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త కనిపించడం లేదని..

ఉక్కుటౌన్‌షిప్, మే 12 (ఆంధ్రజ్యోతి): తన భర్త అదృశ్యమయ్యాడంటూ ఓ మహిళ స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సోమవారం రాత్రి ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్ సెక్టార్-1లో నివాసం ఉంటున్న పవన్‌కుమార్ తనను హింసిస్తున్నాడంటూ భార్య జోత్స్న ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఆయనను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి, మళ్లీ సోమవారం రమ్మని పంపేశారు. కౌన్సెలింగ్ అనంతరం జోత్స్న తన పుట్టింటికి వెళ్లిపోయింది. సోమవారం పవన్‌కుమార్ స్టేషన్‌కు రాకపోవడం, ఫోన్ స్విచ్చాఫ్ కావడంతో ఆయన కనిపించడం లేదంటూ జోత్స్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూకంలో తేడాలుంటే చర్యలు

గాజువాక, మే 12 (ఆంధ్రజ్యోతి): తూకంలో ఎటువంటి అవకతవకలు జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ హెచ్చరించారు. బీసీ రోడ్డులో సోమవారం జరిగిన వరల్డ్ లీగల్ మెట్రాలజీ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వస్తు, సామగ్రి తూకాల విషయంలో ఎటువంటి అవకతవకలు జరగకుండా వ్యాపారులు నియమ, నిబంధనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)

● **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 13, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 24, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 38, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 34 దొండకాయలు 26, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)48, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 90, కీరదోస 36, క్యాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 38, కంద 84, దేముడు చిక్కుడు 44, గోరుచిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



గాజువాక టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ప్రసాదుల శ్రీనివాస్



76వ వార్డులో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న గంధం శ్రీనివాసరావు



86వ వార్డులో చీరలు పంపిణీ చేస్తున్న నల్లూరు సూర్యనారాయణ, తదితరులు

ఘనంగా పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు

పలుచోట్ల కేక్‌లు కట్ చేసి పేదలకు చీరలు, ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసిన టీడీపీ నేతలు

గాజువాక, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను సోమవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గాజువాకలోని పార్టీ కార్యాలయంలో నియోజ కవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాకను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు పల్లా శ్రీనివాసరావు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, బొండా జగన్, పల్లా శ్రీనివాసరావు, బొడ్డు నరసింహపాత్రుడు, రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలనాయుడు, కాకి గోవిందరెడ్డి, తిప్పల వంశీరెడ్డి, దల్లి గోవిందరెడ్డి, నాయకులు నల్లూరు సూర్యనారాయణ, పులి వెంకటరమణారెడ్డి, పుచ్చా విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ 72వ వార్డు అధ్యక్షుడు అక్కిన లక్ష్మణరావు ఆధ్వర్యంలో గాజువాకలో కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, డిజైర్ సొసైటీ విద్యార్థులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. నాయకులు మురళీ, కన్నారావు, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు. గాజువాకలో చేపట్టిన అన్నదానంలో పుచ్చా విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గంధం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో..

పెదగంట్యాడ: పల్లా శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకుని టీడీపీ 76వ వార్డు కార్యాలయంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సమస్యలపై పల్లా అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో పల్లా మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. నాయకులు పీత రమణ, కూన వెంకటరావు, సత్యారావు, జీలకర్ర రమణ,తదితరులు పాల్గొన్నారు. బీసీ రోడ్డు కాకతీయ జంక్షన్‌లో 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు కేక్ చేయడంతో పాటు పేదలకు నిత్యావసరాలు, చీరలు పంపిణీ చేశారు. నాయకులు ఎస్.నాగేశ్వరరావు, కె.కృష్ణ, సుజాత, కె.ప్రభావతి, కాశీవిశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా పల్లా శ్రీనివాసరావు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు పి.సోమునాయుడు, నమ్మి అప్పారావు, డి.పెరుమాళ్లు, ఎం.పెంటయ్య, సురేశ్‌రెడ్డి, తదితరులు పెంటమాంబ ఆలయంలో పూజలు చేశారు.



72వ వార్డులో కేక్ కట్ చేస్తున్న అక్కిన లక్ష్మణరావు

నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో..

కూర్మన్నపాలెం: పేదల పెన్నిధి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అని, ప్రజల సంక్షేమమే తమ పార్టీ ధ్యేయమని గాజువాక టీడీపీ కార్యాలయ ఇన్‌చార్జి గొల్లపూడి నాగేశ్వరరావు అన్నారు. 86వ వార్డు పరిధి మాతృశ్రీ నగర్‌లో టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో పల్లా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి పేదలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీతోనే గాజువాక అభివృద్ధి సాధ్యపడుతుందని నిరూపించిన నేత పల్లా శ్రీనివాసరావు అని కొనియాడారు. నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రజలతో నిత్యం పల్లా మమేకమవ్వడం వల్లే సార్వత్రిక ఎన్నికల్లో ఆయనకు అత్యధిక మెజారిటీ వచ్చిందన్నారు. ప్రజా సేవకుడు పల్లాను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని చేసిన ఘనత సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, జగదీశ్, రమేశ్, అప్పారావు, వెంకటసుబ్బయ్య, నాగార్జున, అప్పారావు, రవి, తదితరులు పాల్గొన్నారు. అలాగే 87వ వార్డు పరిధి వడ్లపూడిలో కార్పొరేటర్ బొండా జగన్ కేక్ కట్ చేసి పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయ రామరాజు, సూరిశెట్టి పెంటారావు,ప్రగడ దానయ్య, శ్రీను, రాంబాబు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. 71వ వార్డు శ్రీనగర్‌లో కార్పొరేటర్ రాజాన రామారావు కేక్ కట్ చేయగా, నాయకులు ప్రతాపరావు, శ్రీనివాసరావు, బి.నాయుడు, రామచంద్రరావు, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: పల్లా శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానికంగా 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కట్ చేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో గల రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. నాయకులు కరణం జగదీశ్, పైడిరాజు, గల్లా రుద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర కేక్ కట్ చేయడంతో పాటు పల్లా పేరిట పెదమడక సంపత్ వినాయకుడి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.

అక్కిరెడ్డిపాలెం: తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెంలో కేక్ కట్ చేశారు. నాయకులు గండికోట తాతారావు, డి.అప్పలరాజు, బి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు అలమండ రాజు కేకు కట్ చేయగా, ఎ.శ్రీను, జి.రామాంజనేయులు, నిర్మలాకుమారి, తదితరులు పాల్గొన్నారు. నాతయ్యపాలెంలో పార్టీ సీనియర్ నాయకురాలు జి.మధులత కేక్ కట్ చేశారు.

అభివృద్ధి అమరావతిలోనే కేంద్రీకృతం

మిగిలిన ప్రాంతాల అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం
సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆరోపణ

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమరావతిని మాత్రమే అభివృద్ధి చేస్తూ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల అభివృద్ధిని విస్మరిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి ఆరోపించారు. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని అమరావతిలోనే కేంద్రీకృతం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తప్పుచేస్తోందన్నారు. అమరావతి కోసం ఇప్పటికే 40 వేల ఎకరాలు సేకరించారని, తాజాగా మరో 40 వేల ఎకరాలు సేకరిస్తున్నారన్నారు. అమరావతికి 30 కిలోమీటర్ల దూరంలో గన్నవరం ఎయిర్‌పోర్టు ఉండగా, మరో అంతర్జాతీయ విమానాశ్రయం కోసమంటూ నాలుగు వేల ఎకరాలు కేటాయించడాన్ని తప్పుబట్టారు. అమరావతిలో రైల్వే స్టేషన్ కోసం 2,600 ఎకరాలు కేటాయించారని, దేశంలో ఏ రైల్వేస్టేషన్ చూసినా వంద ఎకరాలలోపే ఉందన్న విషయాన్ని గుర్తుచేసుకోవాలని కోరారు. విశాఖను ఐటీ రాజధానిగా అభివృద్ధి చేస్తామని చెప్పి, అమరావతిలో ఐకానిక్ టవర్లు నిర్మిస్తున్నారన్నారు. జగన్ వల్ల విశాఖ ఐటీ అభివృద్ధికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీసీఎస్‌తో ఒప్పందం చేసుకుని, ఎకరా భూమిని 99పైసలకు కేటాయించిందని, ఆ సంస్థ ఎప్పటి నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్‌కు గతంలోనే భూములు కేటాయింపుతో పాటు అక్కడ మౌలిక సదుపాయాల కోసం భారీగా నిధులు ఖర్చుపెట్టినా ఇంతవరకూ ఆ సంస్థ పునాదిరాయి కూడా వేయలేదని విమర్శించారు. 2026లో భోగాపురం విమానాశ్రయం కార్యకలాపాలు ప్రారంభమవుతాయని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటించారని, ఇంతవరకూ అనుసంధాన రహదారుల అభివృద్ధి మాత్రం జరగలేదన్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని, టిడ్కో సముదాయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. నగరంలో కాలుష్య సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని ఆరోపించారు. పహల్గాంలో ఉగ్రవాదుల దుశ్చర్య తర్వాత కేంద్రం తీసుకున్న నిర్ణయాలను సమర్థిస్తున్నామన్నారు. అమెరికా, బ్రిటన్ తమ ప్రయోజనాల కోసం తీవ్రవాదాన్ని పెంచి పోషించాయని విమర్శించారు. ఈ సమావేశంలో విశాఖపట్నం జిల్లా నూతన కార్యదర్శి ఎస్‌కే రెహమాన్, సహాయ కార్యదర్శులు కసిరెడ్డి సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు ఎం.పైడిరాజు, సీఎస్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

క్రీడాకారుల తల్లులకు సత్కారం

కూర్మన్నపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): తల్లిని మించిన దైవం లేదని, ప్రతి బిడ్డ విజయంలోనూ తల్లి కీలక పాత్ర పోషిస్తుందని వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్ సతీమణి బి.పద్మ అన్నారు. 88వ వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్, లక్ష్య బ్యాడ్మింటన్ అకాడమీ సంయుక్తంగా మదర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఒలింపియన్ జ్యోతి ఎర్రాజీ మాతృమూర్తి కుమారిని ఘనంగా సత్కరించారు. కుమారి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచులను, ఆశయాలను ప్రోత్సహించాలన్నారు. వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు సతీమణి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సంకల్పం పిల్లల్లో రూపుదిద్దుకునేలా చూడాల్సిన బాధ్యత తల్లులదేనన్నారు. అనంతరం ఒలింపిక్ క్రీడాకారులను తీర్చిదిద్దిన పలువురు తల్లులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి నారాయణరావు, సామాజిక కార్యకర్త సీతామహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఒలింపియన్ జ్యోతి ఎర్రాజీ తల్లి కుమారిని సత్కరిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

» యూటీఎఫ్ నాయకులు

ఆరిలోవ, మే 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో ప్రతి వారం డీఈఓలు సమావేశమవుతున్నా, సమస్యలకు పరిష్కారం చూపడం లేదన్నారు. అధికారుల ఏకపక్ష నిర్ణయాలతో విద్యారంగం నష్టపోతుందన్నారు. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతుల విలీనం జీవో 117 పేరుతో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టిందన్నారు. ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించి పనిభారం పెంచిందని, ఫలితంగా పది లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలల్లో చేరారని చెప్పారు. జీవో 117 రద్దు చేస్తామని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం, దానికి విరుద్ధంగా గత వైసీపీ ప్రభుత్వం బాటలోనే ప్రయాణించడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శాటిలైట్ ఫౌండేషన్ పాఠశాలలు లేకుండా చూడాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి టి. అప్పారావు, సహాయ అధ్యక్షురాలు రొంగలి ఉమాదేవి మాట్లాడుతూ కొత్తగా 779 హైస్కూళ్లు, 9,652 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేయడం హర్షనీయమైనా, ఉన్నత పాఠశాలల్లో 54 మంది విద్యార్థులుంటేనే 2వ సెక్షన్ ఏర్పాటు చేస్తామనడంతో వేలాది ఉపాధ్యాయ పోస్టులు మిగులుతాయన్నారు. దీని వల్ల విద్యా రంగానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి మేరకు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అనంతరం డీఆర్వో, డీఈవోలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, యూటీఎఫ్ నాయకులు ఆర్‌కే ప్రసాద్, వైఆర్‌కే ప్రసాద్, పైడిరాజు, కె.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలి

» జిల్లా అఖిలపక్ష కార్మిక సంఘ నేతల డిమాండ్



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు దగ్గర ఆందోళన చేస్తున్న అఖిలపక్షాల కార్మిక సంఘం

మల్కాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దుచేయాలని కోరుతూ హెచ్‌పీసీఎల్ గేటు దగ్గర సోమవారం అఖిలపక్ష కార్మిక సంఘం ఆందోళన చేసింది. ఈ సందర్భంగా జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మణమూర్తి, వైఎస్ఆర్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆర్.అనిల్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు సత్యనారాయణ మాట్లాడారు. నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ, కార్మిక హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి యజమానులకు కార్మికులను బానిసలుగా చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు, హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట లేబర్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.నరేశ్, ఐఎన్‌టీయూసీ నాయకుడు తాతబాబు, వైఎస్ఆర్‌టీయూ కార్యకర్తలు, ఏఐటీయుసీ నాయకులు పాల్గొన్నారు.

బౌద్ధమత సూత్రాలను పాటించాలి

» జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి

మల్కాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): దుఃఖానికి కారణం కోరికలని, వాటిని తుదముట్టించడం ద్వారా మోక్షం పొందవచ్చని, బుద్ధుడు చెప్పిన మాటలు అందరికీ మంచి చేస్తాయని జాతీయ సేవ పథకం జిల్లా నోడల్ అధికారి ఇపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం బుద్ధపౌర్ణమి సందర్భంగా మల్కాపురం శాఖ గ్రంథాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడుతు బుద్ధుడు అష్టాంగ మార్గం గురించి చెప్పారని అన్నారు. ఎటువంటి అసాంఘీక కార్యక్రమాలు తలపెట్టకూడదని బుద్ధుడు ప్రబోధించాడని ఆమె తెలిపారు. గ్రంథాలయంలో నిర్వహించిన క్విజ్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు గ్రంథాలయాధికారి వి.అజేయ్‌కుమార్ బహుమతులను ఇచ్చారు. మల్కాపురం ఎస్సీ కాలనీ సిద్ధార్థ స్ట్రీట్ లో రామ్-రాంజీ సంక్షేమ సంఘం దగ్గర బుద్ధపౌర్ణమి కార్యక్రమాన్ని సంఘ పెద్ద, బౌద్ధీయులు కాకర పోలరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా బుద్ధుడి విగ్రహం దగ్గర పూలు పెట్టి బుద్ధవందనం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 ఫిర్యాదులు

వేపగుంట, మే 12(ఆంధ్రజ్యోతి): వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్‌లో సీసీ రోడ్ల పనులు పూర్తిచేయాలని, 93, 97, 98వ వార్డుల్లో అనుమతి లేని నిర్మాణాలను అడ్డుకోవాలని, 94వ వార్డు ముత్యమాంబ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని తదితర ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత శాఖలకు పంపించి చర్యలు తీసుకుంటామని జెడ్సీ కే. హైమావతి ఒక ప్రకటనలో తెలియజేశారు.

అగ్నివీరుడు మురళీనాయక్‌కు నివాళి

ఉక్కుటౌన్‌షిప్, మే 12 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రమూకలతో పోరాడుతూ అమరుడైన అగ్నివీరుడు మురళీ నాయక్ దేశానికి గర్వకారణమని ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. మురళీ నాయక్‌కు స్టీల్‌ప్లాంటులో సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను అర్పించిన మురళీ నాయక్ కుటుంబానికి దేశం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పీవీ రమణమూర్తి, బీఎస్ రాజు, కొమ్ము ప్రసాదరావు, కారు రమణ, ఎస్‌ఏ నాయుడు, వెంకన్న, దేముడు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

మద్దిలపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 66 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు 95 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ కోర్సుల నుంచి 8558 మందికి 8162 మంది హాజరుకాగా 396 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుల నుంచి 172 మందికి 150 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 15 కేంద్రాల్లో నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 91 శాతం మంది హాజరయ్యారు. జనరల్ కోర్సుల నుంచి వెయ్యి మందికి 908 మంది పరీక్షలు రాయగా, ఒకేషనల్ కోర్సుల నుంచి 117 మందికి 112 మంది పరీక్ష రాశారు. విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల్లో సీసీ కెమెరాల లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ఆర్ఐఓ కార్యాలయంలో సిబ్బంది పర్యవేక్షించింది. మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రాల తనిఖీలు చేపట్టాయి.

‘మౌలిక వసతులు కల్పించండి’



మేయర్ పీలా శ్రీనివాసరావుకు సమస్యలను వివరిస్తున్న మహిళలు

పెందుర్తి, మే 12(ఆంధ్రజ్యోతి): చినముషిడివాడ బర్ధన్‌నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావుకు కాలనీ వాసులు వినతిపత్రాన్ని అందజేశారు. జీవీఎంసీ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో సీపీఐ నేతల సాయంతో బర్ధన్‌నగర్ వాసులు మేయర్‌ను కలిసి మౌలిక వసతుల కల్పించాలని వినతిపత్రాన్ని అందించారు. కాలనీ సమస్యల పరిష్కారంపై మేయరు సానుకూలంగా స్పందించారు. కాలనీ సమస్యల పరిష్కారానికి సంబంధింత అధికారులతో సమీక్షిస్తానని భరోసా ఇచ్చారు.

ఘనంగా సాంకేతిక దినోత్సవం



కొచ్చి వాటర్ మెట్రో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సాజన్ పి జాన్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్

గోపాలపట్నం, మే 12(ఆంధ్రజ్యోతి): జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని ఎన్ఎస్‌టీఎల్‌లో మహాపాత్ర ఆడిటోరియంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొచ్చి వాటర్ మెట్రో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సౌజన్.పి.జాన్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను ఎదుర్కొవడానికి సాంకేతిక పురోగతి ఎంతో అవసరమని అన్నారు. కొచ్చి వాటర్ మెట్రో అభివృద్ధి గురించి ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ సాంకేతికను సద్వినియోగం చేసుకోవడం వల్ల దేశాన్ని అభివృద్ధి చేయవచ్చని అన్నారు. పలు సాంకేతిక అంశాల అభివృద్ధితో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ దార్శినికతను సాకారం చేయవచ్చని అన్నారు. స్వదేశీ పరిజ్ఞానం, సాంకేతికతతో అభివృద్ధి చెందిన నీటి వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి ఎన్ఎస్‌టీఎల్ పరివారం వినూత్నంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శాస్త్రవేత్త కె.శ్రీకాంత్ మాట్లాడుతూ ‘యుగాంతర్ ఫర్ అడ్వాన్సింగ్ న్యూ టెక్నాలజీ’, ‘రీసర్చ్ అండర్ యాగ్జలరేషన్’ (యంత్ర) కోసం వివరించారు. ఈ సందర్భంగా ‘థర్మల్ సప్రెషన్ ఆఫ్ గ్యాస్ టర్బైన్ ఎగ్జాస్ట్ ఎన్ కాంపాక్ట్ టన్నల్ ఆఫ్ వార్‌షిప్’ అనే అంశంపై సైంటిస్ట్ ఖగేశ కుమార్ చౌదరికి ప్రసంగించారు. ఆయనకు డీఆర్‌డీవో ఛైర్మెన్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సౌజన్.పి.జాన్‌ను ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ సత్కరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ హెచ్ఎన్ దాస్, డీఆర్ రాజేశ్వరి దేవి, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఆకిరీ సునీల్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రైతుబజార్లను ముంచెత్తుతున్న మామిడి



సీతమ్మధార రైతుబజార్‌లో మామిడి కాయలు విక్రయిస్తున్న రైతు

సీతమ్మధార, మే 12 (ఆంధ్రజ్యోతి): మామిడి దిగుబడులు పుష్కలంగా రావడంతో రైతుబజార్లలో గత కొద్ది రోజులుగా ఆవకాయ సందడి జోరందుకుంది. ఈ నెలారంభం నుంచి ఓ పక్క మామిడి కాయలు పోగులుగా అమ్ముతుంటే, ఆ పక్కనే ఆవకాయ కోసం ముక్కలు కొట్టే పని ప్రారంభమైంది. ఇప్పుడు కాయలు పండు దశకు రావడంతో ఊరగాయ పెట్టాలనుకునే గృహిణులు కొనుగోలు చేయడం ప్రారంభించారు. సీతమ్మధార, ఎంవీపీ కాలనీ, ఇతర రైతు బజార్లలో ప్రస్తుతం వీటి విక్రయాలు ఊపందుకున్నాయి. రైతులు తోటల నుంచి కాయలు తెంపి రైతుబజార్‌కు తీసుకొస్తున్నారు. దెబ్బతినని కాయలను ప్రత్యేకంగా ఎంచి ఆవకాయ కోసం విక్రయిస్తున్నారు. ఓ పక్క కాయల విక్రయం, మరో పక్క పచ్చడికి ముక్కలు కొట్టే వారితో రైతు బజార్‌లో ఉదయం నుంచి సందడి కనిపిస్తోంది. ఆవకాయ తయారీకి అవసరమైన కారం, బెల్లం, ఉప్పు, ఆవపప్పు, ఇతర దినుసులు సైతం అక్కడే కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. రైతుబజార్‌లో ఏ స్టాల్‌లో చూసినా అధికంగా మామిడి కాయలు, పండ్లు దర్శనమిస్తున్నాయి. వీటిని కొనుగోలు చేయడానికి జనం ఎగబడుతున్నారు. బంగినపల్లి, సువర్ణ రేఖ, రసాలు, నూజువీడు రసాలు తదితర రకాలు వస్తున్నాయి. కిలో రూ.80, రూ.100లకు లభిస్తున్నాయి. కోలంగోవ, రసాలు, కలెక్టర్ కాయలు, కొత్తపల్లి మామిడి, కొబ్బరి మామిడి వంటి రకాలు లభ్యమవుతున్నాయి.

పచ్చడి కాయలకు భలే డిమాండ్

సీతమ్మధార రైతుబజార్‌లో కొత్తపల్లి మామిడి, కోలంగోవ, కలెక్టర్ కాయలకు భలే డిమాండ్ ఉంది. కాయలు రకాన్ని బట్టి కిలో రూ.35 నుంచి రూ.55 వరకు లభిస్తున్నాయి. పచ్చడి కాయల కోసం చాలా మంది నిరీక్షించి కొనుగోలు చేస్తున్నారు. పచ్చడికాయలను ముక్కలుగా కొట్టేందుకు ప్రతి కాయకు రూ.3 వంతున వసూలు చేస్తున్నారు. కొద్ది గంటల వ్యవధిలోనే ఎక్కువ ఆదాయం రావడంతో కొంత మంది రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గాలులకు కొన్నిచోట్ల మామిడి రాలిపోవడంతో నాసిరకం కూడా వస్తున్నాయి. వీటిని పచ్చడి కాయల కోసం ఎవరూ కొనుగోలు చేయడం లేదు. అలాగే పక్వానికి రాకముందే కొన్ని పండ్లను రసాయనాల ద్వారా పండించి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు రైతులు మాత్రం గడ్డి, ఇతర సంప్రదాయ మార్గాల్లో మగ్గబెట్టి పండ్లను విక్రయిస్తున్నారు.



పచ్చడి కాయలు కొడుతున్న రైతు

బాలలకు క్రీడా సామగ్రి పంపిణీ



చిన్నారులకు వేసవి క్రీడా సామగ్రి అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం స్పోర్ట్సు, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో పాల్గొంటున్న చిన్నారులు, కోచ్‌లకు సోమవారం క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తన కార్యాలయంలో ఫెన్సింగ్, బాల్ బ్యాడ్మింటన్, కరాటే, హాకీ, షటిల్ బ్యాడ్మింటన్ వంటి వివిధ క్రీడాంశాలలో పాల్గొంటున్న క్రీడాకారులు, కోచ్‌లకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోచ్‌లను గౌరవిస్తూ క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేసి నైపుణ్యం, మెలకువల ప్రదర్శనలో పరిణితి సాధించాలని సూచించారు. అనంతరం డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని శిక్షణ పొందుతున్నారని జేసీకి వివరించారు.

ఆలయంలో అన్నదానం



భక్తులకు అన్న ప్రసాదం అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సీతమ్మధార, మే 12 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా సోమవారం నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకాలు, భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. రంగల శ్రీనివాసరావు, అనురాధ దంపతులు ఇందుకోసం ఆర్థిక సహాయం అందచేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి బండారు ప్రసాదరావు, అర్చకులు రామారావుశర్మ, ఉర్జి మహేష్ వర్మ పాల్గొన్నారు.

నేడు దుర్గమాంబ పండగ

కంచరపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56వ వార్డు పరిధి గొల్లకంచరపాలెం గ్రామ దేవత దుర్గమాంబ అమ్మవారి ప్రధాన పండగను మంగళవారం నిర్వహించడానికి గ్రామాభ్యుదయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దుర్గానగర్‌లో గల అమ్మవారి ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. సోమవారం అమ్మవారి తొలేళ్లు ఘనంగా జరిగాయి. 55వ వార్డు పరిధి రెడ్డికంచరపాలెం గ్రామ దేవత కుంచమాంబ అమ్మవారి పండగ కూడా మంగళవారం నిర్వహిస్తారు. ఇందుకోసం తుమ్మడిపాలెం వద్ద గల అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు.

నాలుగు వినతుల స్వీకరణ



వినతిని పరిశీలిస్తున్న జడ్సీ రాము

జ్ఞానాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులు సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 4 వినతులు స్వీకరించారు. రెవెన్యూ, యూసీడీలకు ఒక్కొక్కటి, పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 2 అర్జీలు అందాయి. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. ఈఈ ప్రసన్న, ఈఈ దిలీప్, ఏపీడీ పుణ్యవతి, కృపానందం, ఆర్‌ఓలు బాబురావు, రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు అట్టల పంపిణీ

అక్కయ్యపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు జన్మదినోత్సవం 26వ వార్డు శాంతిపురంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ డీఎస్సీ అభ్యర్థుల పిల్లలకు అట్టలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 16,347 టీచర్ ఉద్యోగాల భర్తీకి డీఎస్సీ ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. జింజలూరు గోవింద్, వాసుపల్లి రాంబాబు, ధన్వి శ్రీకరి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

కొమ్మాది, మే 12 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది జంక్షన్‌లోని మూడుగుళ్ల (త్రిశక్తి దేవాలయం)కు చెందిన భూమిని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సోమవారం వారు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చినగదిలి తహసీల్దార్ పాల్ కిరణ్‌ను కలిసి వేర్వేరుగా వినతి పత్రాలు అందించారు. త్రిశక్తి దేవాలయం వెనుక ఉన్న స్థలం కొన్నేళ్లుగా ఆలయ ఆధీనంలో ఉందని, ఆ స్థలంలో అమ్మవారికి సంబంధించిన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో కూడా కొందరు స్థల ఆక్రమణకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు దగ్గరుండి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. గతంలో ప్రభుత్వ భూమిగా పేర్కొన్న స్థలం ఇప్పుడు ప్రైవేటు భూమిగా ఎలా మారిపోతుందని ప్రశ్నించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి బౌద్ధమే సరైన మార్గం



పౌరగ్రంథాలయంలో ప్రముఖుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అశాంతి, అసమానతల నివారణకు బౌద్ధమే ఏకైక మార్గమని భారతీయ బౌద్ధ మహాసభ (బీఎస్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో గౌతమ బుద్ధుని జయంతి ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రాహుల్ సాంకృత్యాయన్, సామ్రాట్ అశోకుని చిత్రపటాలకు, గౌతమ బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బేతాళ సుదర్శనం మాట్లాడుతూ సాంఘిక అసమానతలు, సమస్యలు, అశాంతికి పరిష్కార మార్గాన్ని బుద్ధుడు వేల సంవత్సరాల కిందటే కనుగొన్నారన్నారు. మనిషి కోరికలపై అదుపు కలిగి ఉన్నప్పుడే సమస్యల పరిష్కారానికి మార్గం ఉంటుందని గౌతమ బుద్ధుడు బోధించారని గుర్తుచేశారు. బహుజనులకు బౌద్ధాన్ని దగ్గర చేసిన ఘనత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ అనేక సమస్యల పరిష్కారానికి బుద్ధుని పంచశీల మార్గమే సరైనదని అంబేడ్కర్ సూచించారని పేర్కొన్నారు. ఎస్ఎస్‌టీఎల్ టెక్నికల్ ఆఫీసర్ ఎన్.రేణుకుమార్, బండి సత్యనారాయణ, బీఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి పి.వి.సుబ్బారావు, ఎం.మల్లయ్య రాజు పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం

కంచరపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): బుద్ధ జయంతి సందర్భంగా కంచరపాలెం దరి బర్మా క్యాంప్ ఆంధ్ర బౌద్ధాలయంలో జిల్లా మహాబోధి సొసైటీ గునుపూడి బాబులు ఆధ్వర్యంలో బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కంచరపాలెం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో బౌద్ధులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారి కింజరాపు ప్రభాకర్ బుద్ధుని బోధనల ప్రాధాన్యతను వివరించారు. సత్యం, అహింస, ధర్మం తదితర సుగుణాలను తప్పకుండా పాటించాలని కోరారు. అనంతరం బర్మా కాందిశీకుల కేంద్ర సంఘం వ్యవస్థాపకుడు మల్లారపు అర్జునరావు విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ భిక్షువులు అషిమ్ రాజా దమ్మ బాంతేజీ, కాంబే బారామో బాంతేజీ, గునుపూడి అరుణ్, జైభీమ్ నగర కన్వీనర్ కోన ప్రకాశ్, డా.రమేష్, హనుమంత్, సాయిచరణ్, ఆనందబాబు, శంకర్, కె.రాజు,రమ్య పాల్గొన్నారు.



అర్జునరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కింజరాపు ప్రభాకర్, బౌద్ధ భిక్షువులు

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు

సింహాచలం, మే 12(ఆంధ్రజ్యోతి) : వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని సింహగిరిపై రాజగోపురానికి చేరువలోని కళావేదికపై విశాఖకు చెందిన అన్నమయ్య జానపద కళా క్షేత్రానికి చెందిన కళాకారులు సోమవారం ఉదయం నుంచి పలు సంకీర్తనలు ఆలపించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆలపించిన అన్నమయ్య కీర్తనలు భక్తులను ఆద్యంతం అలరించాయి. అనంతరం కళాకారులకు ఆలయ సిబ్బంది స్వామివారి దర్శనం కలిపి అన్నప్రసాదాన్ని అందజేశారు.

వైభవంగా వెంకన్న తిరు కల్యాణం

భీమునిపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి తిరు కల్యాణం నిర్వహించారు. తొలుత ఆలయ ప్రధానార్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో యాగశాల్చానలు, విశేష హోమాలు జరిపారు. అనంతరం శ్రీవారి ఉత్సవమూర్తులకు అలంకార తిరుమంజనసేవ, పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెను చేయడం వంటి కార్యక్రమాలను వేదోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం, అన్నమాచార్య సంకీర్తనలు జరిగాయి.



స్వామి తులాభార ఘట్టం

వేసవి క్రీడా శిబిరాలపై సందిగ్ధం

(... 5వ పేజీ తరువాయి)

టెండర్ పిలవాల్సి ఉంటుంది. దీనికోసం కనీసం వారం, పది రోజులు గడువు ఇవ్వాలి. ఈ లెక్కన మే నెలాఖరు నాటికిగానీ టెండర్ ప్రక్రియ పూర్తికాదని అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత టెండర్లు ఖరారై క్రీడా పరికరాలను సరఫరా చేసినాసరే...జూన్ 12 నుంచి పాఠశాలల పునఃప్రారంభం ఉంటుంది కాబట్టి శిబిరాలను నిర్వహించడానికి అవకాశం ఉండదు. ఏటా మే నెలలో జరిగే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను జూన్ నెలలో నిర్వహిస్తే తీవ్రస్థాయిలో విమర్శలు వస్తాయని జీవీఎంసీ పాలకవర్గం పెద్దలు భావిస్తున్నారు. అందుకే వీలైతే షార్ట్‌టెండర్ ద్వారా క్రీడా పరికరాల సరఫరాకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని జీవీఎంసీ అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో వేసవి శిక్షణా శిబిరాల నిర్వహణపై సర్వత్రా సందిగ్ధం నెలకొందనే చెప్పుకోవాలి.

సమ్మర్ ట్రిప్స్ క్యాన్సిల్

(... 5వ పేజీ తరువాయి)

విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. దీనివల్ల ప్రయాణికులు ఇబ్బంది పడకూడదని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా టికెట్లు బుక్ చేసుకున్నవారికి ప్రత్యేకంగా కోడ్ ఇచ్చింది. దానిని ఉపయోగించుకొని టికెట్లు రద్దు చేసుకుంటే డబ్బులు వాపస్ ఇస్తామని వెల్లడించింది. దాంతో గత మూడు రోజుల్లో మా సంస్థలోనే 300 మంది టికెట్లు రద్దు చేసు కున్నారు. దేశీయ పర్యాటక రంగంపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోంది.

పర్యాటకులకు హోమ్ స్టే

(... 5వ పేజీ తరువాయి)

సంస్థ (ఏపీటీఏ) వెబ్‌సైట్‌లో ఎవరికి వారే వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 0891-2754716 నంబరులో సంప్రతించాలని జె.మాధవి సూచించారు. కొద్దిరోజులు గడిచాక ఆసక్తి కలిగిన వారిని పిలిచి అవగాహన సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. విధి విధానాలు తెలియజేస్తామని, పర్యాటకులే నేరుగా ఎవరికి ఎక్కడ నచ్చితే అక్కడి హోమ్ స్టేను ఎంపిక చేసుకుంటారని వివరించారు.

ఉపాధ్యాయ బదిలీలకు రంగం సిద్ధం

(... 5వ పేజీ తరువాయి)

అదనంగా మరిన్ని అవసరమా?, లేక తగ్గించాలా?...అనే అంశంపై ఇప్పటికే అధికారులు ఒక అవగాహనకు వచ్చారు. దీని ప్రకారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 250 వరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మిగులుతున్నట్టు గుర్తించారు. కొత్తగా రానున్న 237 మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా స్కూలు అసిస్టెంట్లను నియమించాలని ప్రభుత్వం ఆదేశించినందున రమారమి 15 నుంచి 20 పోస్టులే మిగిలే అవకాశం ఉంది. ఒక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్నపక్షంలో...అక్కడ ఖాళీగా ఉన్న పోస్టును తొలుత మిగులుగా గుర్తిస్తారు. అనంతరం ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తయిన టీచర్ పోస్టులను పరిగణనలోకి తీసుకుంటారు. ఇలా లెక్కలు కట్టగా ఉమ్మడి జిల్లాలో తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులలో 250 స్కూల్ అసిస్టెంట్లు మిగులు ఉన్నట్టు గుర్తించారు. అయితే వారిని కొత్తగా రానున్న మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వారిలో ఎక్కువమంది సర్దుబాటుకు అవకాశం ఏర్పడింది. దీంతో వచ్చే వారంలో చేపట్టనున్న స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులపై నీలినీడలు కమ్ముకున్నాయి. స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు లేకపోవడంతో పదోన్నతులు ఎలా ఇస్తారని పలువురు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వచ్చే రెండు నెలల్లో ఎక్కువ మంది టీచర్లు పదవీ విరమణ చేయనున్నందున...అప్పుడు ఏర్పడే ఖాళీలను పరిగణనలోకి తీసుకుని స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు కల్పించే అవకాశం ఉందని మరికొందరు భావిస్తున్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల వెల్లువ

(... 5వ పేజీ తరువాయి)

14 నుంచి మే పదో తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించాలి. అయితే, కొన్ని కారణాల వల్ల ఏడో తేదీ నుంచి ఆన్‌లైన్ వెబ్‌సైట్ నిలిచిపోయింది. మరో రెండు, మూడు రోజుల్లో మళ్లీ వెబ్‌సైట్ ఓపెన్ అవుతుందని అధికారులు చెబుతున్నారు. అలాగే, ప్రస్తుతం 32 కేటగిరీలకు సంబంధించి వస్తు తయారీ, సేవల యూనిట్లకు రుణాలను అందిస్తున్నారు. ఈ సంఖ్యను మరింత పెంచే అవకాశం ఉందంటున్నారు. ఇందులో టెంట్ హౌస్, చిరు దుకాణాలు ఏర్పాటు వంటివి చేర్చనున్నట్టు అధికారులు వెల్లడించారు. దీంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ఈ యూనిట్లకు రుణాలు..

ఇప్పటివరకూ ఫ్లవర్ బొకే మేకింగ్ అండ్ డెకరేషన్, వర్మీ కంపోస్ట్ అండ్ ఆర్గానిక్ మాన్యుర్, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్ అండ్ ఐటీ సర్వీసెస్, ఎల్ఈడీ బల్బులు అండ్ ఎనర్జీ సేవింగ్ డివైజ్ అసెంబ్లింగ్, ప్లంబింగ్ అండ్ ఎలక్ట్రీషియన్ సర్వీసెస్, వాటర్ బాటిల్ రీఫిల్ అండ్ ప్యూరిఫికేషన్ కియోస్క్, వాటర్ రీసైక్లింగ్ అండ్ అప్ సైక్లింగ్ బిజినెస్, మొబైల్ రిపేరింగ్ అండ్ ఎలక్ట్రానిక్ సర్వీసెస్, సోప్, డిటర్జెంట్ అండ్ మేకింగ్స్, ఫిష్ ఫార్మింగ్ (అగ్రికల్చర్), అడ్వంచర్ టూరిజం (ట్రెక్కింగ్ అండ్ క్యాంపింగ్), మొబైల్ కార్ వాష్ అండ్ సర్వీస్, బేకరీ అండ్ కన్ఫెక్షనరీ యూనిట్, ఫ్లైయాష్ బ్రిక్ ప్రొడక్షన్, స్కిల్ ప్రొడక్షన్, వాటర్ ప్యూరిఫికేషన్, వెల్డింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ యూనిట్, జూట్ బ్యాగ్ అండ్ ఈకో ఫ్రెండ్లీ ప్రొడక్ట్ మేకింగ్, సోలార్ ఎనర్జీ ప్రొడక్టు సేల్స్ అండ్ ఇన్‌స్టాలేషన్, సోలార్ ప్యానల్ అసెంబ్లింగ్ అండ్ ఇన్‌స్టాలేషన్, కాయిర్ ప్రొడక్ట్ మానుఫ్యాక్చరింగ్, ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ, ఆయుర్వేదిక్ క్లినిక్, జనరిక్ మెడికల్ షాప్, బ్యూటీ పార్లర్, మెడికల్ ల్యాబ్, ఈవీ బ్యాటరీ చార్జింగ్ యూనిట్, పాసింజర్ ఆటో (3 వీలర్-ఈ ఆటో), పాసింజర్ ఆటో (4 వీలర్), పాసింజర్ కార్స్ (4 వీలర్), గూడ్స్ ట్రక్, డ్రోన్స్ ఫర్ అగ్రికల్చర్ (గ్రూప్ ఆక్టివిటీ) వంటివి ఉన్నాయి. వీటికి మరిన్ని సెక్టార్లను జోడించనున్నట్టు చెబుతున్నారు.

కేజీహెచ్‌లో ఘనంగా నర్సింగ్ దినోత్సవం



కొవ్వొత్తులు వెలిగించి చూపుతున్న అతిథులు, నర్సింగ్ సంఘ ప్రతినిధులు

మహారాణిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవాన్ని సోమవారం కేజీహెచ్‌లో ఘనంగా నిర్వహించారు. నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథులుగా వినియోగదారుల న్యాయస్థానం జడ్జి రెహమున్నీసా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌లు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కొవ్వొత్తులు వెలిగించి నైటింగేల్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కేకు కోసి మిఠాయిలు పంపిణీ చేశారు. నర్సింగ్ వృత్తి విశిష్టతను తెలియజేసిన అతిథులు, మరింత ప్రభావవంతంగా రోగులకు సేవలందించాలని సూచించారు. విశిష్ట సేవలు అందించిన పలువురు నర్సులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎంవో మెహర్‌కుమార్, సంఘం జిల్లా అధ్యక్షురాలు టి.గంగాభవాని, జీవీఎస్ వరలక్ష్మి, ఇందిర, పద్మజ, గౌరి, మోహర్ శాంతి, పలువురు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైశాఖ పౌర్ణమి పూజలు



సత్యనారాయణమూర్తి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

మహారాణిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఇసుకకొండ రమా సత్యనారాయణ స్వామి వార్ల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కేజీహెచ్ ప్రాంగణంలో పౌర్ణమి ఆలయంగా ప్రసిద్ధిగాంచింది. ఈ సందర్భంగా కొండపై ఆలయంలో సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. పంచరాత్ర ఆగమ సంప్రదాయంలో స్వామి, అమ్మవార్లను అలంకరించి, ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ధ్వజస్తంభాన్ని తాకి ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. మూడు బ్యాచ్‌లుగా సుమారు 210 మంది భక్తులు వ్రతాల్లో పాల్గొన్నారు. ఈవో రాజగోపాల్ భక్తులకు మంచినీరు, ఉచిత ప్రసాద వితరణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. హరినామ స్మరణతో ఆలయం మారు మోగింది.

ఘనంగా పల్లా జన్మదిన వేడుకలు



టీడీపీ కార్యాలయంలో కేకు కోస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, మేయర్ పీలా శ్రీనివాసరావు, చిత్రంలో ఆ పార్టీ ఇతర నాయకులు, కార్యకర్తలు



మురళీనగర్ టీడీపీ కార్యాలయంలో పల్లా జన్మదిన వేడుకలు జరుపుకొంటున్న అభిమానులు

మహారాణిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావులు కేకు కోశారు. మేయర్ మాట్లాడుతూ ఇటు ప్రజలకు, అటు పార్టీకి పల్లా ఎనలేని సేవలందిస్తున్నారని కొనియాడారు. టీడీపీకి సేవ చేసే అవకాశం మరో వందేళ్లు ఆయనకు ఇవ్వాలని ఆకాంక్షించారు. గండి బాబ్జి మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచిన పల్లా శ్రీనివాసరావు మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చోడే పట్టాభిరామ్, ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్, పొలమరశెట్టి శ్రీనివాసరావు, వెల్లంకి భరత్, బైరెడ్డి పోతన రెడ్డి, నక్కా కనకరాజు, గొలగాని వీరారావు, బల్లశ్రీను, గల్లా చిన్నా, అనంతలక్ష్మి, ఈతలపాటి సుజాత, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పల్లా శ్రీనివాస్ బంధువులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మురళీనగర్‌లో...

మురళీనగర్: పల్లా జన్మదిన వేడుకలు మురళీనగర్‌లో ఘనంగా నిర్వహించారు. బీసీల్లో సమర్థుడైన నాయకుడు పల్లా అని టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ కొనియాడారు. అభిమానుల మధ్య కేకు కోసి పల్లా శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు. పల్లా అధ్యక్షతన టీడీపీ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు రామచంద్రరావు, పి.శ్రీనివాస్, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో ఎట్టకేలకు అదనపు స్టాల్స్



కంచరపాలెంలో నిర్మిస్తున్న దుకాణాలు

కంచరపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం రైతుబజార్‌లో రైతులకు ఊరట కలిగించే విధంగా అదనపు స్టాల్స్ నిర్మాణం కోసం మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. బజార్‌లో ప్రస్తుతం ఉన్న స్టాల్స్‌కు అదనంగా మరో 8 దుకాణాల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఇక్కడ రైతులకు సరిపడే దుకాణాలు అందుబాటులో లేక పలువురు నేలపైనే కూరగాయలు వేసి విక్రయిస్తుంటారు. దీంతో గతంలో ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనాలకు అధికారులు స్పందించి అదనపు దుకాణాల ఏర్పాటుకు చర్యలు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎనిమిది అదనపు దుకాణాల నిర్మాణంతో పాటు మరికొన్ని దుకాణాల ఎత్తు పెంచే పనులు జరుగుతున్నాయి. అత్యంత రద్దీగా ఉండే కంచరపాలెం రైతుబజార్‌లో అభివృద్ధి పనులు చేపట్టడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, మే 12 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్‌లో గల బీజేపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు దరఖాస్తుదారులకు సోమవారం అందజేశారు. 48వ వార్డుకు సంబంధించిన వారికి రూ.2,51,419 చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరు అనారోగ్యం పాలైనా ఆసుపత్రికి సంబంధించిన ఒరిజినల్ బిల్లులు పెట్టాలని కోరారు. అప్పుడే సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు కృషి చేస్తామన్నారు. బీజేపీ నార్త్ కన్వీనర్ సురేష్‌బాబు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దుకాణాలు

ఫుట్‌పాత్ ఆక్రమణ

ఆరిలోవ.మే 12 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి సాయిబాబా ఆలయానికి వెళ్లే మార్గంతో పాటు సాలిపేట, పెదగదిలి వెళ్లే మార్గంలో కొందరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఈ రోడ్డు చాలా ఇరుగ్గా ఉంటుంది. దీనికితోడు ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా కూడళ్ల వద్ద ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవ్వడంతో వాహనాలు యూ టర్న్ తీసుకునే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి'

ఎంవీపీ కాలనీ, మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 18వ వార్డును డంపర్ బిన్లు లేకుండా తీర్చిదిద్దినట్టు కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలరావు తెలిపారు. ఎంవీపీ కాలనీ ఏడో సెక్టరు ప్రియదర్శిని కాలనీలో చివరి డంపర్ బిన్‌ను తొలగించి, సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా డంపర్ తొలగిస్తున్నట్టు చెప్పారు. ఇకపై బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసినా, కాలువల్లో ఇతరత్రా వస్తువులు పారేసినా రూ. వెయ్యి జరిమానా వేస్తామని జీవీఎంసీ అధికారులు హెచ్చరించారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రజలంతా భాగస్వామ్యులు కావాలని కోరారు.

ల్యాప్‌టాప్‌ల చోరీపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, మే 12 (ఆంధ్రజ్యోతి) : ల్యాప్‌టాప్‌ల చోరీపై ఫిర్యాదు అందినట్టు నేర విభాగం ఏఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు. వివరాలివి.. ఉషోదయ కూడలిలో ఓ ఇంట్లో ఉంటున్న అలజంగి కిశోర్‌కుమార్, అతడి మిత్రుడు గత నెల 27న రాత్రి తలుపులు తెరిచి పడుకున్నారు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి రెండు ల్యాప్‌టాప్‌లు చోరీకి గురయ్యాయి. పరిసరాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా ప్రభాత్ రంజన్ సర్కార్ జయంతి

ఆరిలోవ, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఆనంద మార్గ్ ఆశ్రమంలోని పిల్లలంతా బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆనందమార్గ్‌కి చెందిన ఆచార్య సౌమ్యానంద అవదూత అన్నారు. సోమవారం పాత డెయిరీ ఫారం సమీపంలోని ఆనందమార్గ్ ఆశ్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ప్రభాత్ రంజన్ సర్కార్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాత్ సర్కార్ జీవితంపై రూపొందించిన చిత్రాలను ప్రదర్శించారు.

సినిమా గైడ్

● **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)

● **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 13, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 24, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 38, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 16, క్యారెట్ 34 దొండకాయలు 26, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)48, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 44, దోసకాయ 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 90, కీరదోస 36, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 38, కంద 84, దేముడు చిక్కుడు 44, గోరుచిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్ కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

నిరుపయోగంగా టూరిస్ట్ పోలీస్ స్టేషన్

» పర్యాటకులకు కరువైన భద్రత
» అందుబాటులో లేని సిబ్బంది
» ఎంతో కీలకమైన ప్రదేశంపై నిర్లక్ష్యం

బీచ్ రోడ్డు, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఆర్కే బీచ్‌లో టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌కు నిర్వహణ కరువై నిరుపయోగంగా మారింది. ఆర్కేబీచ్‌కు ప్రతిరోజూ అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. వీకెండ్స్, సెలవు రోజులు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించే రోజుల్లో ఈ రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత గల ప్రాంతం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ 2023లో టూరిస్ట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసింది. అప్పట్లో పది మంది సిబ్బంది పని చేసేవారు. లారెస్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో అందించిన రెండు స్యాండ్ పెట్రోలింగ్ వాహనాలు, పది ద్విచక్ర వాహనాలు ఉండేవి. ఈ ప్రాంతంలో ఏవైనా నేరాలు జరిగితే ఇక్కడ ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు.అలాగే సమాచార కేంద్రంగా కూడా పని చేసేది. పర్యాటకుల వద్ద ఆటోవాలాలు ఎక్కువ చార్జీలు వసూలు చేయకుండా నియంత్రిస్తుంటారు. ఈ స్టేషన్ 24 గంటల పాటు అందుబాటులో ఉంటుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులకు ఇక్కడ పర్యాటక సమాచారం ఇస్తుంటారు. ఎవరైనా సముద్రంలో ఈతకు వెళ్లి కొట్టుకుపోతే అక్కడ ఉన్న లైఫ్‌గార్డులను అప్రమత్తం చేస్తుంటారు. అయితే ప్రస్తుతం ఇక్కడ సిబ్బంది ఎవరూ లేరు. పర్యాటకులకు కావాల్సిన సమాచారం అందించే దాఖలాలు కూడా లేవు. తీరంలో సముద్ర స్నానానికి వెళ్లి కెరటాల తాకిడికి కొట్టుకుపోయే ఎందరో పర్యాటకులకు రక్షణ కరువైంది. పర్యాటకులకు ఎదురయ్యే సమస్యలు, ఫిర్యాదులు చేద్దా మన్నా సిబ్బంది అందుబాటులో లేకుండాపోతున్నారు. నిర్వహణ భారంగా మారడంతో పోలీస్ శాఖ ఈ స్టేషన్‌ను నిరుపయోగంగా వదిలేసినట్టు తెలిసింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



బీచ్ రోడ్డులో ఉన్న టూరిస్ట్ పోలీస్ స్టేషన్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

డీఈఓ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ధర్నా

ఆరిలోవ, మే 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో ప్రతి వారం డీఈఓలు సమావేశమవుతున్నా, సమస్యలకు పరిష్కారం చూపడం లేదన్నారు. అధికారుల ఏకపక్ష నిర్ణయాలతో విద్యారంగం నష్టపోతుందన్నారు. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతుల విలీనం జీవో 117 పేరుతో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టిందన్నారు. ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించి పనిభారం పెంచిందని, ఫలితంగా పది లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలల్లో చేరారని చెప్పారు. జీవో 117 రద్దు చేస్తామని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం, దానికి విరుద్ధంగా గత వైసీపీ ప్రభుత్వం బాటలోనే ప్రయాణించడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శాటిలైట్ ఫౌండేషన్ పాఠశాలలు లేకుండా చూడాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి టి. అప్పారావు, సహాయ అధ్యక్షురాలు రొంగలి ఉమాదేవి మాట్లాడుతూ కొత్తగా 779 హైస్కూళ్లు, 9,652 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేయడం హర్షనీయమైనా, ఉన్నత పాఠశాలల్లో 54 మంది విద్యార్థులుంటేనే 2వ సెక్షన్ ఏర్పాటు చేస్తామనడంతో వేలాది ఉపాధ్యాయ పోస్టులు మిగులుతాయన్నారు. దీని వల్ల విద్యా రంగానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి మేరకు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అనంతరం డీఆర్‌వో, డీఈవోలకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, యూటీఎఫ్ నాయకులు ఆర్‌కే ప్రసాద్, వైఆర్‌కే ప్రసాద్, పైడిరాజు, కె. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మంత్రి లోకేశ్‌ను కలిసిన వీఎంఆర్‌డీఏ చైర్మన్



వెంకోజీపాలెం, మే 12(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌ను వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ ఉండవల్లి లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, బృహత్ ప్రణాళిక, ఎంఐజీ బడ్జెట్ అపార్ట్‌మెంట్ హౌసింగ్ స్కీమ్ తదితర అంశాలను మంత్రికి వివరించారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం పూర్తయ్యే నాటికి విశాఖను అనుసంధానం చేసే రోడ్లన్నీ అందుబాటులోకి తీసుకురావాలని, నగరంలోని పార్కులను అభివృద్ధి చేయాలని సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

మద్దిలపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 66 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు 95 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ కోర్సుల నుంచి 8558 మందికి 8162 మంది హాజరుకాగా 396 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుల నుంచి 172 మందికి 150 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 15 కేంద్రాల్లో నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 91 శాతం మంది హాజరయ్యారు. జనరల్ కోర్సుల నుంచి వెయ్యి మందికి 908 మంది పరీక్షలు రాయగా,ఒకేషనల్ కోర్సుల నుంచి 117 మందికి 112 మంది పరీక్ష రాశారు. విద్యార్థులు అర్ధగంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల్లో సీసీ కెమెరాల లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ఆర్ఐఓ కార్యాలయంలో సిబ్బంది పర్యవేక్షించారు. మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రాల తనిఖీలు చేపట్టారు.

'నర్సింగ్ వృత్తి ఉన్నతమైనది'



రిఫల్ ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న చీఫ్ మెడికల్ ఆఫీసర్ అనిత

ఆరిలోవ, మే 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విభాగంలో నర్సింగ్ వృత్తి ఉన్నతమైనదని ఆరిలోవ ఫస్ట్ రిఫరల్ యూనిట్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిత అన్నారు. సోమవారం ఆస్పత్రి ఆవరణలో జరిగిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. నైటింగేల్ నర్సింగ్ రంగంలో చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. యుద్ధ సమయంలో ఎంతోమంది క్షతగాత్రులకు ఆమె సేవలందించారన్నారు. నర్సులు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాగసుధ, స్టాఫ్ నర్సులు ప్రమీల, ఉమ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 88 వినతులు

వెంకోజీపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 88 వినతులు వచ్చాయని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తితో కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జీవీఎంసీలో ప్రతి సోమవారం అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నారన్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే అన్ని జోనల్ కార్యాలయాల్లో స్వీకరించిన అర్జీల విషయంలోనూ ఎటువంటి అలసత్వం వహించరాదని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని అధికారులు, ఉద్యోగులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

కౌన్సిల్ అజెండాలో ముఖ్యమైన అంశాలను చేర్చండి

విశాఖపట్నం : వచ్చే కౌన్సిల్ సమావేశంలో చర్చించేందుకు వీలుగా పలు కీలకమైన అంశాలను అజెండాలో చేర్చాలని కోరుతూ జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావుకు జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ వినతిపత్రం అందజేశారు. టీడీఆర్‌లకు సంబంధించిన సమస్యలు, కోడి వ్యర్థాల సేకరణ, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, యూసీడీ వ్యవహారాలు, జీవీఎంసీ దుకాణాల లీజులు, ఆశీలు వసూలు, జీ-20 పనులు, పాత జైలు రోడ్డులోని నైట్‌ఫుడ్ కోర్ట్, జీవీఎంసీలో అనుసరిస్తున్న బిల్లుల చెల్లింపు విధానం వంటి అంశాలను అజెండాలో చేర్చడం ద్వారా లోతైన చర్చ జరిగేలా చర్యలు తీసుకోవాలని మూర్తియాదవ్ కోరారు.

ఘనంగా పోలమాంబ తొలేళ్లు



మద్దిలపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెంలో పోలమాంబ తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారు భక్తులకు నిజరూప దర్శనమిచ్చారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ సేవా సంఘం అధ్యక్షుడు దువ్వి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బుద్ధల కృష్ణ, కోశాధికారి దువ్వి వెంకటస్వామి,కార్యనిర్వాహక కార్యదర్శి చెల్లి బోయిన సునీల్‌కుమార్, కార్యదర్శులు ముప్వల మౌళి, హరి ప్రసాద్, సాంబశివరావు, ఒమ్మి అప్పారావు పాల్గొన్నారు.

చిలకలూరిపేట సీఐ తీరు సరికాదు : వైసీపీ



మాట్లాడుతున్న వైసీపీ విశాఖ జిల్లా ఇన్‌చార్జి కేకే రాజు

సిరిపురం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి విడదల రజనీపై చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు ప్రవర్తించిన తీరును ఖండిస్తున్నామని వైసీపీ జిల్లా ఇన్‌చార్జ్ కేకే రాజు అన్నారు. సీఐ తీరును ఖండిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ జిల్లా మహిళ, బీసీ, ఎస్సీ, యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి మహిళలంటే గౌరవం లేదన్నారు. మాజీ మంత్రి రజనీ కారులో వస్తుండగా ఆమెతో అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా ఆమె సహాయకుడ్ని దౌర్జన్యంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిపై పోలీసులతో దాడి చేయించి, వారి నోరు మూయించాలని చూస్తున్నారన్నారు. అలాగే గుంటూరు జిల్లా కంతేరులో వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు కల్పనను తెల్లవారుజామున 3 గంటల సమయంలో పోలీసులు దౌర్జన్యంగా అరెస్టు చేయడం హేయనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు కరణం ధర్మశ్రీ, తిప్పల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వెంకట రామయ్య, డిప్యూటీ మేయర్ సతీశ్, తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో భాగంగా కొవ్వొత్తులు వెలిగిస్తున్న అతిథులు రెహ ముస్నీసా, డాక్టర్ శివానంద్, నర్సింగ్ సంఘం ప్రతినిధులు

కేజీహెచ్‌లో ఘనంగా నర్సింగ్ దినోత్సవం

మహారాణిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవాన్ని సోమవారం కేజీహెచ్‌లో ఘనంగా నిర్వహించారు. నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథులుగా వినియోగదారుల న్యాయస్థానం జడ్జి రెహముస్నీసా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. కొవ్వొత్తులు వెలిగించి నైటింగేల్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కేకుకోసి మిఠాయిలు పంపిణీ చేశారు. నర్సింగ్ వృత్తి విశిష్టతను తెలియజేసిన అతిథులు, మరింత ప్రభావవంతంగా రోగులకు సేవలందించాలని సూచించారు. నర్సింగ్ వృత్తిలో అంకితభావంతో సేవలందించాలని, వృత్తి నైపుణ్యాలతో పాటు విలువలు పాటించాలని చెప్పారు. అనంతరం విశిష్ట సేవలు అందించిన పలువురు నర్సులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎంవో మెహర్‌కుమార్, సంఘం జిల్లా అధ్యక్షురాలు టి. గంగాభవాని, జీఎస్ వరలక్ష్మి, ఇందిర, పద్మజ, గౌరి, మోహర్ శాంతి, నర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలు అందజేత

ఎంవీపీ కాలనీ, మే 12 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర అనారోగ్యానికి గురైన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందింది. తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఆరిలోవకు చెందిన బోడెపు హరితకు రూ. 1,65,425, గణపవరపు భ్రమరాంబకు రూ. 30, 675 మంజూరు పత్రాలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొలగాని పోలారావు, బోర ధనరెడ్డి, బుగత సత్యనారాయణ, ఆడారి కామేశ్, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

ఆరిలోవ, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ప్రాంతంలో సోమవారం సాయంత్రం 15 నిమిషాల పాటు వర్షం కురిసింది. ఉదయం నుంచీ తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు సాయంత్రం పడిన వర్షంతో ఉపశమనం పొందారు.

అభివృద్ధి అమరావతిలోనే కేంద్రీకృతం

» మిగిలిన ప్రాంతాలను విస్మరించిన ప్రభుత్వం
» సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమరావతిని మాత్రమే అభివృద్ధి చేస్తూ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల అభివృద్ధిని విస్మరిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆరోపించారు. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని అమరావతిలోనే కేంద్రీకృతం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తప్పు చేస్తోందన్నారు. అమరావతి కోసం ఇప్పటికే 40 వేల ఎకరాలు సేకరించారని, తాజాగా మరో 40 వేల ఎకరాలు సేకరిస్తున్నారన్నారు. అమరావతికి 30 కిలోమీటర్ల దూరంలో గన్నవరం ఎయిర్‌పోర్టు ఉండగా, మరో అంతర్జాతీయ విమానాశ్రయం కోసమంటూ నాలుగు వేల ఎకరాలు కేటాయించడాన్ని తప్పుబట్టారు. అమరావతిలో రైల్వే స్టేషన్ కోసం 2,600 ఎకరాలు కేటాయించారని, దేశంలో ఏ రైల్వేస్టేషన్ చూసినా వంద ఎకరాలలోపే ఉందన్న విషయాన్ని గుర్తుచేసుకోవాలని కోరారు. విశాఖను ఐటీ రాజధానిగా అభివృద్ధి చేస్తామని చెప్పి, అమరావతిలో ఐకానిక్ టవర్లు నిర్మిస్తున్నారన్నారు. జగన్ వల్ల విశాఖ ఐటీ అభివృద్ధికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీసీఎస్‌తో ఒప్పందం చేసుకుని, ఎకరా భూమిని 99 పైసలకు కేటాయించిందని, ఆ సంస్థ ఎప్పటి నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్‌కు గతంలోనే భూములు కేటాయింపుతోపాటు అక్కడ మౌలిక సదుపాయాల కోసం భారీగా నిధులు ఖర్చు పెట్టినా ఇంతవరకూ ఆ సంస్థ పునాదిరాయి కూడా వేయలేదని విమర్శించారు. 2026లో భోగాపురం విమానాశ్రయం కార్యకలాపాలు ప్రారంభమవుతాయని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారని, ఇంతవరకూ అనుసంధాన రహదారుల అభివృద్ధి మాత్రం జరగలేదన్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని, టిడ్కో సముదాయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. నగరంలో కాలుష్య సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని ఆరోపించారు. పహల్గాంలో ఉగ్రవాదుల దుశ్చర్య తర్వాత కేంద్రం తీసుకున్న నిర్ణయాలను సమర్థిస్తున్నామన్నారు. అమెరికా, బ్రిటన్ తమ ప్రయోజనాల కోసం తీవ్రవాదాన్ని పెంచి పోషించాయని విమర్శించారు. ఈ సమావేశంలో విశాఖపట్నం జిల్లా నూతన కార్యదర్శి ఎస్‌కే రెహమాన్, సహాయ కార్యదర్శులు కసిరెడ్డి సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు ఎం.పైడిరాజు, సీఎస్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

భక్తిశ్రద్ధలతో వైశాఖ పౌర్ణమి పూజలు

మహారాణిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి) : వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఇసుకకొండ రమా సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కేజీహెచ్ ఆవరణలో పౌర్ణమి ఆలయంగా ప్రసిద్ధిగాంచింది. ఈ సందర్భంగా కొండపై ఉన్న ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. పంచరాత్ర ఆగమ సంప్రదాయంలో స్వామి, అమ్మవార్లను అలంకరించి, ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ధ్వజస్తంభాన్ని తాకి ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. మూడు బ్యాచ్‌లుగా 210 మంది భక్తులు వ్రతాల్లో పాల్గొన్నారు. ఈవో రాజగోపాల్ భక్తులకు తాగునీరు, ప్రసాదాలు అందించారు.

భయపెడుతున్న వీధి కుక్కలు

బీచ్ రోడ్డు, మే 12, (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జాలారిపేట వద్ద వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ మార్గంలో నడిచి వెళ్లాలంటే స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల బీచ్ రోడ్డులో ఓ బాలుడు కుక్కల దాడితో గాయపడి ఆసుపత్రి పాలయ్యాడు. నగరంలో వీధి కుక్కల నియంత్రణకు పటిష్ఠ వ్యవస్థ ఉన్నా.. ఏటా రూ. లక్షల వెచ్చిస్తున్నా.. వాటి సంఖ్య తగ్గడం లేదు. ముఖ్యంగా రెల్లివీధి, జాలారిపేట, ఫిషింగ్ హార్బర్ ప్రాంతాల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ పాదచారులపై దాడి చేస్తున్నాయి. నిబంధనల మేరకు కుక్కలకు శస్త్ర చికిత్స చేసి వాటి సంఖ్యను తగ్గించాలి. కానీ ఎక్కడా అలా జరగడం లేదు. జీవీఎంసీలో 40 మంది కుక్కలను పట్టే వ్యక్తులు (డాగ్ స్నాచింగ్ బ్యాచ్), ఏడు వాహనాలు ఉన్నాయి. వీటితో కుక్కల సంతతిని నిరోధించాల్సి ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



జాలారిపేట రహదారిపై కుక్కల గుంపు

నిత్యావసర వస్తువుల కృత్రిమ కొరత సృష్టించొద్దు


హోల్‌సేల్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కర్

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో నగరంలో నిత్యావసర సరుకులకు కృత్రిమ కొరత సృష్టించవద్దని జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కర్ స్పష్టంచేశారు. సోమవారం సాయంత్రం తన చాంబర్‌లో నగరంలోని హోల్‌సేల్ డీలర్ల సంఘం, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ ఆహారధాన్యాలు, పప్పులు, వంటనూనెలు ప్రజలకు సులభంగా లభ్యమయ్యేలా చూడాలని, ఎక్కడా అక్రమంగా నిల్వలు చేయవద్దని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచవద్దని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలు ప్రతి ఒక్కరూ పాటించాలని, ధరలు పెంచినా, వస్తువులకు కొరత సృష్టించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సహాయ పౌరసరఫరాల అధికారులు కల్యాణి, ప్రసాద్, హోల్‌సేల్ డీలర్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ఎస్.సూర్యారావు, జైన్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్న ఏయూ వీసీ


గవర్నర్ నుంచి అవార్డు తీసుకుంటున్న రాజశేఖర్

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్‌కు తెలంగాణలోని అకాడమీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందించింది. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి జరిగింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నుంచి ఆయన అవార్డు అందుకున్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్‌కు ఈ అవార్డును అందించారు. శాస్త్ర, సాంకేతిక రంగాలకు రాజశేఖర్ అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు.

బీసీ స్టడీ సర్కిల్‌కు పూర్వ వైభవం

కూటమి అధికారంలోకి రావడంతో ప్రారంభమైన శిక్షణ

- గ్రూప్-2 అభ్యర్థులకు మెయిన్స్‌లో శిక్షణ, స్టైఫండ్
- డీఎస్సీ అభ్యర్థులకు రెండు నెలల ఉచిత తర్ఫీదు
- రూ.1500 స్టైఫండ్, పుస్తకాలకు రూ.వెయ్యి అందజేత
- ఏపీ స్టడీ సర్కిల్‌లోనూ శిక్షణ ప్రారంభం



విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి):

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బీసీ స్టడీ సర్కిల్ పూర్వ వైభవం సంతరించుకుంది. ఏళ్లుగా ఈ స్టడీ సర్కిల్ ద్వారా నిరుపేద అభ్యర్థులకు ప్రభుత్వం ఉచిత శిక్షణతో పాటు ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా బీసీ స్టడీ సర్కిల్స్‌ను నిర్వీర్యం చేసింది. ఐదేళ్లు పట్టించుకున్న దాఖాలు లేవు. గతంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులతో కళకళలాడే ఈ స్టడీ సర్కిల్స్ వైసీపీ హయాంలో నిద్రావస్థలోకి వెళ్లిపోయాయి.

ప్రభుత్వశాఖల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు వైసీపీ ప్రభుత్వం కనీసం ఒక్కటంటే ఒక్కనోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదు. దీంతో స్టడీ సర్కిల్స్‌లో శిక్షణ గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ స్టడీ సర్కిల్స్‌పై దృష్టి సారించింది. రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇప్పటి వరకు రెండు కేటగిరీలకు చెందిన అభ్యర్థులు ఉచిత శిక్షణ పూర్తి చేశారు. ఇటీవల గ్రూప్-2 మెయిన్స్‌కు శిక్షణ చేపట్టారు. జిల్లాలోని 37 మందికి శిక్షణతోపాటు రెండు నెలలపాటు ఒక్కో అభ్యర్థికి రూ.1500 చొప్పున స్టైఫండ్ ఇచ్చారు. మెటీరియల్ కోసం అదనంగా మరో రూ.వెయ్యి మంజూరుచేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా టీచర్ పోస్టులను భర్తీచేసేందుకు ప్రభుత్వం సిద్ధమైన దశలో బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని 59 మందికి రెండు నెలల శిక్షణ, నెలకు రూ.1500 స్టైఫండ్, మెటీరియల్‌కు రూ.వెయ్యి చొప్పున ఇచ్చారు. ప్రైవేటు శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు.



ఏపీ స్టడీ సర్కిల్‌లోనూ...

ఎస్సీ సామాజికవర్గానికి చెందిన నిరుపేద అభ్యర్థులకు సివిల్స్, బ్యాంకులు, ఇతర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించేందుకు 2017లో గత టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ఏపీ స్టడీ సర్కిల్స్‌ను ఏర్పాటుచేసింది. ఇందులో ఒకటి విశాఖలో ఏర్పాటు చేశారు. సుమారు రూ.4.5 కోట్లు వెచ్చించి రుషికొండ సమీపంలో దీనిని ఏర్పాటు చేశారు. గత వైసీపీ హయాంలో ఒకటి, రెండుసార్లు సివిల్స్ అభ్యర్థులకు మాత్రమే శిక్షణ ఇచ్చింది. ఆ తరువాత గాలికి వదిలేసింది. పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు వంద మందికి ఇక్కడ సివిల్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఉచిత వసతి, భోజన సదుపాయాన్ని కల్పించారు. ప్రస్తుతం డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ అందించడంతోపాటు భోజన, సవతి సదుపాయాన్ని కల్పిస్తున్నారు. సుమారు 50 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు. వీరికి రూ.3 వేలు విలువజేసే మెటీరియల్‌ను అందిస్తున్నామని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు తెలిపారు.

వసతి కోసం విద్యార్థుల ఆందోళన

పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతుండడంతో వినతిని పరిశీలించాలని డిమాండ్

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీలో వివిధ కోర్సులు చదువుతూ టీచర్, పోలీసు ఉద్యోగాలకు పోటీ పరీక్షలు, నెట్, సెట్ వంటి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు వేసవి సెలవుల్లో వర్సిటీలోని హాస్టళ్లలో వసతి సౌకర్యాన్ని కల్పించాలంటూ సోమవారం వీసీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఉదయం వీసీ కార్యాలయం వద్దకు చేరుకుని వీసీని కలిసేందుకు ప్రయత్నించారు. ఆయన అందుబాటులో లేరని సిబ్బంది తెలియజేయడంతో అక్కడే కొద్దిసేపు నిరసన తెలిపారు. నాలుగు రోజులుగా వీసీని కలిసేందుకు ప్రయత్నిస్తున్నా వర్సిటీ అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు ఇది అత్యంత కీలకమైన సమయం, హాస్టల్ సదుపాయం లేక సన్నద్ధతపై ప్రభావం పడుతోందంటూ పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు వసతిగృహాల్లో ఉండే అవకాశం కల్పించాలని ఉన్నతాధికారులను కోరారు. వేసవిలో నీటి సమస్య ఉండడం, నవీకరణ పనులు చేపట్టడం వల్లే వసతిగృహాలకు సెలవులు ఇచ్చినట్టు అధికారులు ప్రకటించారు. సోమవారం ఏయూలోని కొన్ని హాస్టళ్లలో ట్యాంకుల నుంచి నీరు వృథాగా పోతుండడాన్ని విద్యార్థులు గుర్తించారు. ఇలా వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, నీటి సమస్య సాకు చెప్పి హాస్టళ్లను మూసేశారంటూ పలువురు విద్యార్థులు ఆక్రోశించారు.


ఏయూ వీసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

సీపీ గ్రీవెన్స్‌కు 120 ఫిర్యాదులు


తన కార్యాలయంలో ఓ మహిళ సమస్యను వింటున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 120 ఫిర్యాదులు వచ్చినట్టు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. పోలీస్ సమావేశ మందిరంలో సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిశీలించిన తర్వాత సంబంధిత అధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడి ఆ సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీపీకి అందిన ఫిర్యాదుల్లో అత్యధికం భూ వివాదాలు, కుటుంబ కలహాలు, మోసం, సివిల్ వివాదాలకు సంబంధించినవే ఉన్నాయి.

1100 నెంబరుకు ఫోన్ చేసి అర్జీ పరిస్థితి తెలుసుకోండి

- ప్రజలకు కలెక్టర్ సూచన
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కొత్తగా 208 ఫిర్యాదులు
- అర్జీలపై 24 గంటల్లో విచారణ చేపట్టాలి

మహారాణిపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు అందజేస్తున్న ఫిర్యాదుల పరిష్కారంపై పురోగతిని తెలుసుకోవడానికి దరఖాస్తుదారులు 1100 నెంబరుకు ఫోన్ చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేందిర్ ప్రసాద్ సూచించారు. ప్రజలు అందజేసిన అర్జీలపై 24 గంటల్లో విచారణ చేపట్టాలని అధికారులకు నిర్దేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 208 దరఖాస్తులు అందాయి. వినతులలో రెవెన్యూ శాఖకు 80, జీవీఎంసీ 52, పోలీసు 19, ఇతర విభాగాల నుంచి 57 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అర్జీ అందజేసిన ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పరిష్కారానికి సంబంధిత విభాగాలకు అందజేశారు. అనంతరం వివిధ శాఖలలో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై ఆరా తీశారు. ప్రతీ సోమవారం కలెక్టర్ కార్యాలయం, మండల కార్యాలయాలకు వచ్చే అర్జీదారులు తమ అర్జీల పరిష్కారంలో పురోగతిని 1100 కాల్ సెంటరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని సందేహాలు ఉన్నా అడగవచ్చని సూచించారు. అదే కాల్ సెంటర్ ద్వారా కొత్త ఫిర్యాదులు కూడా నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీశంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు

వీఎంఆర్డీఏ బాలల ప్రాంగణంలో వేసవి శిబిరం

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి వచ్చేనెల 10 వరకు వీఎంఆర్డీఏ బాలల ప్రాంగణంలో వేసవి శిబిరం జరగనుంది. 10 నుంచి 15సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొనేందుకు అర్హులు. చిత్రలేఖనం, చేతిరాత (దస్తూరీ), జానపద నృత్యం, శాస్త్రీయ నృత్యం, ఇంద్రజాలం, బ్రేక్‌డ్యాన్స్, కరాటే, కిక్‌బాక్సింగ్ వంటివి నేర్పించనున్నట్లు వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని, ఆసక్తి గలవారు 7989785145 నెంబరుకు ఫోన్‌చేసి తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఇంధనాన్ని పొదుపుగా వాడాలి

ద్వారకా బస్‌స్టేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకోవాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు డ్రైవర్లకు సూచించారు. ఇంధనాన్ని ఆదా చేసిన డ్రైవర్లను సత్కరించి వారికి నగదు బహుమతులు అందజేశారు. మద్దిలపాలెం డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్ తన నైపుణ్యాన్ని ఉపయోగించి ఇంధనాన్ని ఆదాచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలా ఇంధనం ఆదా చేయడం వల్ల కేఎంపీఎల్ పెరిగి ఆర్టీసీకి నిర్వహణ వ్యయం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణకుమారి, అసిస్టెంట్ ఇంజినీర్ బిందు, అసిస్టెంట్ మేనేజర్ మాధురి, స్టేషన్ మేనేజర్ మూర్తి పలువురు సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు. ఏప్రిల్ నెలలో అధిక ఇంధనాన్ని ఆదా చేసిన డ్రైవర్లను సత్కరించారు.

ఘనంగా 'పల్లా' జన్మదిన వేడుకలు


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కళ్లేపల్లి శ్రీనివాసవర్మ, పల్లా శ్రీనివాస్, గంధం శ్రీనివాసరావు

గాజువాక, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను సోమవారం గాజువాక క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో పాత గాజువాకలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి కళ్లేపల్లి శ్రీనివాసవర్మ, కళ్లేపల్లి అశోక్ వర్మ, ఇందుకూరి శిరీష్ కుమార్‌రాజు, ఇందుకూరి సత్యప్రసాద్ రాజు, అయినంపూడి వెంకట రమణరాజులు పాల్గొన్నారు. 73వ వార్డులో జరిగిన కార్యక్రమంలో మహిళలకు కళ్లేపల్లి శ్రీనివాస వర్మ, టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావులు చీరలు పంపిణీ చేశారు.


టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దంపతులను శాలువాతో సత్కరించిన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

క్రైం... crime news

విద్యుత్ స్తంభం పైనుంచి జారిపడి ఒప్పంద కార్మికుడు మృతి

పెందుర్తి, మే 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభంపై మరమ్మతులు నిర్వహిస్తుండగా పైనుంచి జారిపడి కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. ఈఘటన వేపగుంట సబ్‌స్టేషన్ పరిధి పెందుర్తి సమీపంలోని పెదగాడిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. విశాఖ జిల్లా పద్మనాభంకు చెందిన బొడ్డు బంగారునాయుడు(26) విద్యుత్ శాఖలో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్నాడు. విద్యుత్ లైన్ల మరమ్మతు నేపథ్యంలో పెదగాడిలో స్తంభంపై పనులు చేస్తుండగా అకస్మాత్తుగా జారి కింద పడిపోయాడు. సమాచారం అందుకున్న కాంట్రాక్టర్ హుటాహుటిన వెళ్లి సంఘటనా స్థలం నుంచి తీవ్రంగా గాయపడిన కార్మికుడిని గోపాలపట్నంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అవివాహితుడైన బంగారునాయుడు స్తంభం పైనుంచి జారిపడి మృతిచెందాడా? విద్యుదాఘాతంతో మృతి చెందాడా? అన్న విషయంపై విచారణ జరుపుతున్నట్లు సీఐ చెప్పారు. పట్టు కోల్పోవడంతో జారిపడి మృతి చెందాడని వేపగుంట విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ సురేశ్ స్పష్టం చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

అగి ఉన్న లారీని ఢీకొన్నకారు.. ఒకరి మృతి


ప్రమాదంలో మృతి చెందిన నవీన్‌రెడ్డి

లంకెలపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. విశాఖ నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన చింతపల్లి నవీన్‌రెడ్డి (27) సోమవారం ఉదయం తన కారులో రాజమహేంద్రవరం బయలు దేరాడు. లంకెలపాలెం కూడలి దాటిన తరువాత మరిడిమాంబ ఆలయం వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి రహదారి పక్కన ఆగి ఉన్న లారీను బలంగా ఢీకొన్నాడు. దీంతో నవీన్‌రెడ్డి కారులోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు


భక్తులతో కిటకిటలాడుతున్న పుష్కరిణి

సింహాచలం, మే 12 (ఆంధ్రజ్యోతి) : వైశాఖ పూర్ణిమ పురస్కరించుకుని అప్పన్న స్వామి దర్శనానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో కొండదిగువన, గిరిపైన రద్దీ నెలకొంది. ఏటా వైశాఖ పౌర్ణమి నాడు సముద్ర తీరంలోని మత్స్యకార గ్రామాల నుంచి భక్తులు ముందు రోజు సాయంత్రానికే సింహాచలం చేరుకుంటారు. ఈమేరకు ఆదివారం మధ్యాహ్నం నుంచి సింహాచలం కొండదిగువ పరిసరాల్లో భక్తుల రాక ప్రారంభమైంది. వారంతా వరాహ పుష్కరిణికి చేరుకుని స్నానాలు ఆచరించి, ఒడ్డున కోలలను వెలిగించి భక్తితో రాత్రంతా జాగరణ చేశారు. సోమవారం వేకువజామున మెట్లమార్గంలో సింహగిరికి చేరుకుని రాజగోపురం ఎదురుగా మాడవీధుల్లో గరిడీలతో హరినామస్మరణలతో ఉపవాస దీక్షలతో గడిపారు. తరువాత అంతరాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈఓ సుజాత పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా పుష్కరిణిలో స్నానాలు చేయడానికి వచ్చిన భక్తుల రద్దీ వల్ల తొక్కిసలాటలో చిన్నారి కాలు జారి నీట మునిగింది. విజయనగరం జిల్లా చిన్నాపురం గ్రామానికి చెందిన ధరణిశ్రీ (11) తల్లిదండ్రులతో కలిసి సింహాచలం చేరకుని పుష్కరిణి వద్ద కుటుంబ సభ్యులతో ఆడుకుంటోంది. ఆ భక్తుల తోపులాటలో తల్లి కళ్ల ముందే చిన్నారి నీటిలో పడిపోయింది. వెం టనే సింహాచలం గ్రామానికి చెందిన ఈతగాళ్లు బాలికను బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. దేవస్థానం డీఈఈ హరి పుష్కరిణి వద్దకు చేరుకుని బాలికను సింహాచలంలోని గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం తల్లిదండ్రులు ఆమెను మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు.

అప్పన్నకు రెండో విడత చందనం సమర్పణ


స్వామివారికి చందనం అద్దుతున్న ప్రధానార్చకులు

సింహాచలం, మే 12 (ఆంధ్రజ్యోతి) : అప్పన్నస్వామికి సోమవారం వేకువజామున రెండో విడత చందనం సమర్పించారు. ఏటా మాదిరిగానే వైశాఖ మాస శుక్ల పూర్ణిమ పురస్కరించుకుని వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. వేద పండితుల చతుర్వేద పారాయణలు, నాదస్వరాలాపనలు నడుమ వైదిక పరివారం ముందుగా సిద్ధం చేసిన మూడు మణుగు (125 కిలో)ల సుగంధ ద్రవ్యాల చూర్ణాలు మిళితం చేసిన చందనపు ముద్దను తొలుత అంతరాలయంలో మూలవిరాట్‌కు అద్దారు. తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులు, ఆళ్వార్లతో ఆస్థాన మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. పంచసూక్త పారాయణలను అధ్యాపకులు చేస్తుండగా స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణాచార్యులు సారథ్యంలో అర్చకులు పసుపు ముద్దలు పెట్టి నూనె రాసి పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం పవిత్ర గంగధార జలాలతో స్నపన తిరుమంజనం జరిపి, ఉత్సవమూర్తి చందన కిరీటం, భుజకీర్తులకు చందనం అద్దారు. ఉత్సవ ఏర్పాట్లను దేవాలయ ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి ప్రసాద్ పర్యవేక్షించారు.

సాలూరు శ్యామలాంబ జాతరకు వంద ప్రత్యేక బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): సాలూరు శ్రీ శ్యామలాంబ జాతరకు వంద ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. ఈ నెల 18 నుంచి అయిదు రోజులు జరుగనున్న ఈ ఉత్సవాలకు రోజూ 20 బస్సులు చొప్పున నడపాలని ప్రణాళిక రూపొందించారు. రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి ఎక్స్‌ప్రెస్, మెట్రో, సూపర్ లగ్జరీ సర్వీసులను ఎంపిక చేశారు. వాటికి ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు సంబంధిత డిపో మేనేజర్లను, మెకానికల్ ఇంజినీర్లను ఆదేశించారు. విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ నుంచి ప్రతి గంటకు సాలూరుకు షెడ్యూల్ సర్వీసులు ఉన్నప్పటికీ జాతర రోజుల్లో ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఈ ప్రత్యేక సర్వీసులు నడుపుతామని రీజనల్ మేనేజర్ తెలిపారు. శ్యామలాంబ జాతరకు రాకపోకలు సాగించే భక్తులు ఆర్టీసీ విశాఖ రీజియన్ కల్పించే ఈ రవాణా సౌకర్యాలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.